
# మనిషిలో మనిషి

పెద్దకథ

అవధానుల
విజయలక్ష్మి




**చీకటి** సముద్రంలోకి దూసుకు పోతున్న జలాంతర్గామిలా దూసుకుపోతూంది మద్రాస్—హైద్రాబాద్ లింక్ ఎక్స్‌ప్రెస్.

అర్ధరాత్రి రెండు గంటలకి ప్రపంచమంతా గాఢ సుషుప్తిలోకి ఒరిగిపోయింది.

కంపార్ట్‌మెంట్‌లో మనుష్యు లందరూ కూర్చునే జోగుతున్నారు.

మూసి ఉన్న కిటికీ అద్దాల్లో జోగుతున్న మనుష్యుల మొహాలు అస్పష్టంగా కనపడుతున్నాయి.

22—2—84

తెరిచి ఉన్న కంపార్ట్‌మెంటు తలుపు దగ్గర మాత్రం ఇద్దరు కుర్రాళ్ళు నిలుచుని తల బయటకు పెట్టి ఆత్రతగా చూస్తున్నారు.

ఎదుట సీటుమీద అమ్మ ముడుచుకుని పడుకుని ఉంది. నా మనస్సంతా ఉద్వేగంతో నిండిపోయింది. పాతికేళ్ళ ఆడదాన్ని. ఒంటరిగా ప్రపంచంలోకి అడుగు పెట్టాను, అమ్మని నేను చూసుకోగలనన్న నమ్మకంతో ఎదుటి సీటుమీద నిద్ర పోతున్న అమ్మ చిన్న పిల్లలా కనిపించిం దో క్షణం!

జీవితాన్ని మలుపు తిప్పే ఈ ప్రయాణం చాలా హఠాత్తుగా జరిగి పోతూంది. నిన్నటిదాకా అమ్మ నీడలో, మామయ్య రక్షణలో విశ్రాంతిగా గడిపేశాను. రేపటినుంచి అమ్మకి నేనే రక్షణ వహించి ఇంటి బాధ్యతలూ, ఉద్యోగ బాధ్యతలూ చక్కబెట్టు కోవాలి.

మనసంతా ఆనందంగానూ ఉంది. భారంగానూ ఉంది.

ఈ సారి అన్నీ ఆఖరి నిమిషంలోనే జరిగాయి.

ఎప్పుడో ఆర్నెల్ల కిందట అప్లికేషన్ పెట్టాను ఈ ఉద్యోగానికి!

ఒక ప్రైవేట్ ఫర్మ్‌లో ఉద్యోగం. చక్కటి జీతం.

సరిగ్గా పదిరోజుల కిందటే వచ్చింది అపాయింట్‌మెంట్ ఆర్డర్. అప్లికేషన్‌లో మామయ్య అడ్రస్ ఇచ్చాను. అయిదు నెలల పాటు ఎదురుచూసి చూసి ఇక రాదని నిరాశ చేసుకున్నాక పది రోజుల కిందట వచ్చిం దది!

కాని ఆ రోజే మామయ్య కుటుంబం అంతా వూరికి వెళ్ళడంతో ఇంట్లో పోస్ట్‌మాన్ పడేసి పోయిన ఆ కవరు నిన్ననే సాయంత్రం మామయ్యా వాళ్ళూ వూరినించి వచ్చాక చూడ్డం జరిగింది!

మామయ్య మరో రోజు ఆలస్యంగా వూరినించి వస్తే ఏమయ్యేదో! బహుశః ఈ ట్రెయిన్‌లో ఇలా కూర్చుని ఉండడం కాకుండా, ప్రపంచమంతా నిద్ర పోతున్నట్లే నేనూ మా ఇంట్లో గాఢంగా నిద్ర పోతూ ఉండేదాన్నేమో?


రేపే ఆఖరిరోజు జాయినింగ్ రిపోర్ట్ ఇయ్యడానికి.

రేపు పొద్దున్న పది గంటల్లోపున జాయినింగ్ రిపోర్ట్ ఇయ్యకపోతే, ఆ ఉద్యోగం ఆర్డర్ ఆఫ్ ప్రయారిటీలో రెండో వాళ్ళకి వెళ్ళిపోతుంది!! అపాయింట్‌మెంట్ ఆర్డరు చూడగానే ఆదరా బాదరా పాత ఉద్యోగానికి రాజీనామా చేసేయడం, సామాన్లు సర్దేయడం, మామయ్య ఎక్కించిన బండిలో పరుగెత్తుకొచ్చి ఎక్కడం, అన్నీ కలలోలా జరిగిపోయాయి.

తలుచుకుంటూ ఉంటే ఇప్పటికీ ఆశ్చర్యంగా ఉంది ఇదంతా జరిగిందా అని!

జీతం రమారమి ఇప్పుడు వస్తున్న దానికి రెండు రెట్లు.

ట్రెయినెక్కిన తరవాత రెండు గంటల పాటు ఎక్కువైన జీతాన్ని ఎలా బాంకులో వేసుకోవాలో ఏయే నగలు కొనుక్కోవాలో, కట్నానికి డబ్బు ఎలా కూడబెట్టుకోవాలో, పెళ్ళి, దానివల్ల లాభాలు ఎన్నెన్నో చెప్పి చెప్పి అలిసిపోయి అమ్మ నిద్ర పోయింది.




ట్రెయిను డోర్నకల్ చేరేసరికి అర్ధరాత్రి దాటుతుంది.

కాని తప్పదు! రేపొద్దున్న పది లోపల చేరే ట్రెయినిదే.

డోర్నకల్‌లో కలుసుకోవలసిన తన ఫ్రెండ్ని పరిచయం చేశాడు మామయ్య. తెల్లారేదాక స్టేషన్‌లో గడిపేసి తెల్లారుజామునే ఆ ఎడ్రస్ పట్టుకుని వాళ్ళింటి కెళ్ళాలి. మిగిలిన పనులన్నీ ఆయనే చూసుకుంటాడు! కంపార్ట్‌మెంట్ తలుపు దగ్గర నిలుచున్న కుర్రాళ్ళలో ఉంగరాల జుత్తున్న కుర్రాడు ఉండుండి నా వైపు ఒక క్షణం చూసి చూపులు తిప్పేసుకుంటున్నాడు.

ఆ కళ్ళు. ఆ చూపులు. ఎక్కడో పరిచయమైనవే!

ఎక్కడ? అతనికి సుమారు ఇరవై రెండేళ్ళు ఉండొచ్చు. ఈ కుర్రాడు నాకు తెలియదు. కాని ఇటువంటి చూపులే నాకు బాగా పరిచయం! అమాయకంగా, చురుగ్గా, రవి! అవును రవి! అతని కళ్ళే. అతని చూపులే! అప్పుడు ఇదే వయస్సులో ఉండేవాడు. అప్పుడు...

● ● ● ●

బి.కామ్. పాసై ఏడాదయి పోయింది. టైపిన్స్టిట్యూట్‌లో టైపు నేర్చుకునే దాన్ని!

ఒక రోజు పక్క మెషిన్‌మీద టైపు నేర్చుకుంటున్న ఉంగరాల జుత్తు కుర్రాడు టైపు చెయ్యడం ఆపి నా వైపు తిరిగి అడిగాడు.

"ఏమండీ మీకు బి. కామ్.లో ఫస్ట్ క్లాసొచ్చిందట కదా? ఎక్కౌంట్స్‌లో ఎక్స్‌పర్టని విన్నాను. నిజమేనా?" అమాయకతతో ఆశ్చర్యం మేళవించి అడిగాడు.

"మీ కెవళ్ళు చెప్పారు?" చిరునవ్వుతో అడిగాను.

"తెలిసింది లెండి. మా చుట్టాలబ్బాయొకడు మీ క్లాసులోనే చదివాడు వాడు చెప్పాడు. ఇంటర్‌లో వాది సైన్సు గ్రూపండి. మొన్ననే బి.కామ్. ఫస్ట్ ఇయర్‌లో జాయినయ్యాను. ఎక్కౌంట్స్ అలా తొకా తెలియడం లేదు. మీకు టైముంటే ప్లీజ్! అప్పుడప్పుడు కోచింగ్ ఇస్తారా?" ఆశగా అడిగాడు.

"తప్పకుండా. రోజూ టైపింగ్ నించి వెళ్ళాక నేను ఖాళీగానే ఉంటాను. మీరు ఎప్పుడు కావాలంటే అప్పుడు రావచ్చు" సంతోషంగా అన్నాను.

ఆ రోజునించి అతను రోజూ సాయంత్రం ఆరయ్యేసరికల్లా హాజరయ్యేవాడు. నేను వివరించి చెబుతుంటే శ్రద్ధగా వినేవాడు.

"మాడమ్. ఆ టైపూ షార్ట్‌హాండూ మానేసి హాయిగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ చెయ్యకూడదూ? లెక్చరర్‌గా బ్రహ్మాండంగా రాణిస్తారు" అనే వాడొక్కొక్కసారి నా వైపు ఆరాధనగా చూస్తూ.

అతని అమాయకత్వానికి నవ్వుకునే దాన్ని.

చేస్తున్న పార్ట్ టైమ్ ఉద్యోగమే ఇంట్లో అవసరాన్ని పూర్తిగా తీర్చలేక పోతూంది! ఇంక ఈ ఉద్యోగంకూడా మానేసి యూనివర్సిటీలో చేరిపోయి ఏం తిందామని!

"అలాగేనోయ్! నీ సలహా తప్పక పాటిస్తా" అనేదాన్ని నవ్వుతూ. అమాయకంగా కనిపిస్తున్నా ఎంతో చురుకైన కుర్రాడు!

ఒకసారి చెప్పిన వెంటనే గ్రహించే వాడు.

నా కంటే మహా ఉంటే రెండు మూడేళ్ళు చిన్నవాడై ఉంటాడేమో! అయినా ఏదో ఆప్యాయత పుట్టుకొచ్చేది.

ఎన్ని పనులున్నా మానుకొని అతనికి చదువు చెప్పే దాన్ని!

అతను ఒక్కో మెట్టూ ఎక్కుతుంటే చెప్పలేనంత తృప్తిగా అనిపించేది! బి.కామ్. ఫస్టియరు పరీక్షలయిపోయాయి. చాలా బాగా రాశా నన్నాడు.


ఆ రోజు పొద్దున్న తొమ్మిది గంటలకి నేను ఆఫీసుకి వెళ్ళడానికి తయారవుతుంటే అతను హడావిడిగా వచ్చాడు.

"మార్కుల లిస్టు వచ్చేసింది, మాడమ్" అన్నాడు ఆనందంగా.

నా రిజల్ట్సే వచ్చినట్లు గుండె కొట్టుకొంది ఒక్క క్షణం.

"ఎకౌంట్స్‌లో ఎన్ని మార్కు లొచ్చాయి?" ఆత్రంగా అడిగాను.

"చెప్పుకోండి చూద్దాం?" అతను నవ్వుతూ




చేతిలో ఉన్న కాగితాన్ని వెనక్కి దాచేశాడు.

"డబ్బై" అన్నాను. అవును మరి—ఏ సంవత్సరం పాటు ఎంతో శ్రద్ధగా చెప్పినందుకు ఆ మాత్రమైనా రావాలి మరి!

"సారీ, మాడమ్" అన్నాడు తలొంచుకొని.

"ఏం? అన్ని రాలేదా?" నిరాశగా అడిగాను.

అతను నా చేతికి షీట్ అందించాడు.

గబగబా లైన్ల వెంట నా కళ్ళు పరిగెత్తాయి.

ఏకాం ఒకటి — తొంభై నాలుగు!

నా మనసు సంతోషంతో నిండిపోయింది.

కష్టపడి పెంచిన మొక్క వికసించినప్పుడు కలిగే సంతోషం... అపురూపంగా పెంచిన బిడ్డ తప్పటడుగులు వేసేటప్పుడు కలిగే సంతోషం!

"హార్టీ కంగ్రాట్స్" అన్నాను అతని రెండు చేతులూ నా రెండు చేతుల్లోకి తీసుకొని ఊపేస్తూ.

"కంగ్రాట్స్ మీరు కాదు ... నేనే మీకు చెప్పాలి!" అన్నాడతను.

"సరేలేవోయ్. ఇద్దరం ఒకళ్ళ కొకరం కంగ్రాట్స్ చెప్పుకొంటూ కూర్చొనే లోపున పుణ్యకాలం కాస్త గడిచిపోతుంది. స్వీట్ తెస్తానుండు" అంటూ లోపలి కెళ్ళి రెండు రోజుల క్రితం ఎవరి పెళ్ళిలోనో పంచిన మైసూర్‌పాక్ ముక్క ఉంటే అది తెచ్చి అతని నోట్లో కుక్కాను.

"ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యావ్ ... మంచి మార్కులు తెచ్చుకొన్నావ్ ... మరి గురువుగారికి గురు దక్షిణ ఏమిస్తావోయ్?" హాస్యంగా అడిగాను.

అతను చప్పున జేబులో చెయ్యి పెట్టి ఓ వంద రూపాయల నోటు బయటికి తీశాడు.

నేను తెల్లబోయాను.

"ఇదేమిటి! ఏదో హాస్యానికి అంటే నిజంగానే డబ్బు తీసేశా వేమిటోయ్?" అన్నాను కంగారుగా.

"లేదండీ... మీ రిప్పుడు హాస్యానికే అన్నారని నాకు తెలుసు ... కాని బయల్దేరే ముందు ఈ నోటు మీ కిద్దామన్న ఉద్దేశంతోనే జేబులో వేసుకొచ్చాను ... అఫ్‌కోర్స్... సంవత్సరంపాటు మీరు పడ్డ శ్రమకి ఇది చాలా తక్కువే అనుకోండి ... కాని మేం కూడా మీలాగే మధ్య తరగతి వాళ్ళం ... ఈ బి.కామ్. చెప్పించేడానికే నాన్న ఎంతో కష్టపడుతున్నాడు." ఆగిఆగి తలొంచుకొని నెమ్మదిగా అన్నాడు.

"చూడు, రవీ! నేను ట్యూషన్ చెప్తున్న ఉద్దేశంతో ఇన్నాళ్ళూ నీ కీ కోచింగ్ ఇయ్యలేదు. నీకు చెప్తున్నాళ్ళూ నీతోబాటు నాకూ నాలెడ్జి పెరిగింది. ఇప్పుడు నా కెంతో తృప్తిగా ఉంది! ఈ డబ్బుతో ఏమైనా మంచి పుస్తకాలు కొనుక్కో" అన్నాను ఆప్యాయంగా.

"మాడమ్! మీ రీ వందరూపాయలూ తీసుకోకపోతే నాకు చాలా బాధగా ఉంటుంది. మళ్ళా వచ్చే సంవత్సరం కూడా మీ దగ్గరికి కోచింగ్‌కి రావాలి! మీ రిప్పుడు తీసుకోకపోతే ముందు ముందు నాకు ఫ్రీగా ఉండదు."

నా మనస్సు ఇటూ అటూ ఊగింది. ఆ క్షణంలో ఆ వంద రూపాయలూ ఎన్నో అవసరాల్ని ఆదుకొంటాయి. నిజానికి నేను పుచ్చుకోవడంలోనూ అన్యాయం లేదు... కాని ...

ఆ సంతోష సమయంలో ఆ డబ్బు తీసేసుకొని, నా హక్కుని నిరూపించుకొని వాతావరణాన్ని కలుషితం చెయ్యాలనిపించలేదు! ప్రస్తుతం ఈ విషయం వాయిదా వేస్తే చాలు!

"చూడు, రవీ! గురువుగారికి దక్షిణ ఇస్తున్నావ్! బాగానే ఉంది. కాని గురు దక్షిణ ఎవ్వరూ ఇలా ఇవ్వరు—తెలిసిందా? పువ్వులూ, పళ్ళూ, తాంబూలంతో బాటు సమర్పించుకోవాలి." ఛలోక్తిగా నవ్వుతూ అన్నాను.

"నిజమేనా, మేడమ్!" నా కళ్ళలోకి సూటిగా చూస్తూ అడిగాడు.

"నిజమే. పువ్వుల్లో పెట్టి ఇస్తేకాని తీసుకోను." మరింత నవ్వుతూ అన్నాను.

"సరే వస్తాను, మేడమ్." అతే నా నోటుని తిరిగి జేబులో పెట్టేసుకొని వెళ్ళిపోయాడు.

ఆ రోజు సాయంత్రం ఏడు గంట లప్పుడు ... రోజూలాగే అమ్మ గుడికి వెళ్ళిపోయింది.

నేను చీర కుచ్చిళ్ళు పైకి దోపుకుని పెరట్లో మొక్కలకి నీళ్ళు పోస్తున్నాను.

పెరటి తలుపు దబదబా బాదా రెవరో...

కుచ్చిళ్ళు కిందికి దింపుకొని వెళ్ళి తలుపు తీశాను.

రవి! చేతిలో ఓ సంచీ ఉంది.

"ఇదేమిటి సంచీతో ఇలా ప్రత్యక్షమయ్యావ్? బజార్నించి వస్తున్నావా?" అడిగాను.

"చెప్తాను... క్విక్ ... ముందొక స్టీలు పళ్ళెం తెండి. ప్లీజ్!" అతను హడావిడిగా అన్నాడు.

"పళ్ళెమా? ఎందుకూ? ఆ సంచీలో పెట్టుకున్నవేవో వీధిలోనే కంచంలో పెట్టుకుని తినేస్తావేమిటి?" నవ్వుతూ అడిగాను.

"ఏం చేస్తానో చూస్తారుగా! ముందు పళ్ళెం తెండి!" అతని హడావిడికి నవ్వుకుంటూ వెళ్ళి పళ్ళెం తెచ్చి ఇచ్చాను.

మంచి మార్కులు వచ్చిన సంతోషంలో బజారు నుంచి ఏదో మిఠాయి తెచ్చి ఉంటాడు.

అతనికి నా మీద ఉన్న గౌరవానికి గర్వ పడుతూ కాఫీ కలపడానికి వంటింట్లో కెళ్ళాను.

నేను కాఫీ గ్లాసుతో తిరిగొచ్చేసరికి ముందు గదిలో టేబిల్ మీద పెట్టి ఉంది ఆ పళ్ళెం.

కాని అందులో ఉన్నవి మిఠాయి కాదు!

మాలగా కట్టిన గుప్పెడు మల్లె పూలూ—ఎర్రగా మెరుస్తూ రెండు ఆపిల్ పళ్ళూ—రెండు తమల పాకులూ—ఆ తమల పాకుల్లో ఒక వంద రూపాయల నోటూ—ఆ నోటు మీద ఒక పోక చెక్క.

పొద్దున్న నేను ఛలోక్తిగా అన్న మాటల్ని అప్పుడే మరిచిపోయాను.

కాని నేనన్న మాటల్ని అక్షరాలా పాటించిన అతని ప్రవర్తనకి నవ్వూ, జాలీ రెండూ ఒకేసారి వచ్చాయి.

పద్దెనిమిది, పందొమ్మిదేళ్ళు నిండినా ఇంత అమాయకు డేమిటి?

తలొంచుకుని కూర్చున్న వాడు నేను వంటింట్లోంచి వచ్చిన అలికిడికి తలెత్తి చూశాడు.

"గురుదక్షిణ సమర్పించుకొంటున్నాను, మాడమ్!" అన్నాడు నా కళ్ళలోకి ఒక్క క్షణం చూసి గబుక్కున చూపులు తిప్పేసుకుంటూ.

"ఛలేవాడివోయ్. పొద్దున నేను హాస్యాని కన్న మాటని అక్షరాలా పాటించేశావ్" అన్నాను ఫక్కున నవ్వుతూ.

అతను లేచి నిలుచున్నాడు. పళ్ళెంలో ఉన్న పూలు చేతిలోకి తీసుకున్నాడు.

"గురుదక్షిణ స్వీకరించండి, మేడమ్!" అని పువ్వుల్ని నా కళ్ళ దగ్గర పెడతాడను కొంటే...

లేకపోతే వంద రూపాయల నోటుతో బాటు పువ్వుల్నికూడా దోసిట్లో పోస్తాడో!

పిచ్చోడ! సినిమాల్లో ఇటువంటి సన్నివేశాలు చూస్తుంటే బాగానే ఉన్నా, నిజ జీవితంలో ఎదురైనా అంటే ఇబ్బందిగానే ఉంటుంది.

చేతిలో పూలతో అతను నా దగ్గరి కొచ్చాడు. నేను ఇబ్బందిగా కదిలాను. ఏం మాట్లాడాలో తోచ లేదు.

దగ్గర కొచ్చిన అతను ఆ పువ్వుల్ని నా పాదాం దగ్గరా ఉంచలేదు, చేతికోమా పొయ్యలేదు.

గబుక్కున నా మొక్కళ్ళి నా ఒళ్లో పెట్టేశాడు.

అసలేమయిందో గ్రహించే లోపున అతని రెండు చేతులూ నా రెండు చేతుల్నీ పట్టుకుని ఉన్నాయి.

"ఏం చేశావ్, రవీ?" నమ్మలేనట్టు అడిగాను.

"సారీ, మేడమ్. వెరీ వెరీ సారీ. ఈ పని ఎప్పుడో— ఎన్నాళ్ళ కిందటో చెయ్యవలసింది. కాని మీ మనస్సు గ్రహించలేక పోయాను. పోనీలెండి— ఇప్పటికైనా నాకు తెలియ చెప్పారు. పొద్దున్న నాకు మీరలా ఎక్స్‌ప్లెయిన్ చెయ్యకపోతే నే నింకా అలా మొద్దు గాణ్ణా తెలియకుండానే గడిపేసే వాడిని." రవి అలా గబగబా చెప్పుకు పోతున్నాడు.

నిశ్చేష్టురాల్నై, మాటలు రాని దానిలా నేను వింటున్నాను.

"ఈ సంవత్సరం లోనూ ఎన్నోసార్లు మీరు నాకు చెబుదామని చూసినట్లున్నారు. నేనే గ్రహించలేదు. రోజూ మీ అమ్మగారు గుడికి వెళ్ళాకనే వచ్చే వాడిని. మీరు చెబుతుంటే చాలాసార్లు అనుమానం వచ్చిందనుకోండి. కాని నా దుత్త అనుమానమేనేమోలే అని సరిపెట్టుకున్నాను. ఇవాళ పొద్దున్న మీరు అంతసేపు నా చేతులు పట్టుకున్నప్పుడూ, పూలూ పళ్ళతో గురుదక్షిణ సమర్పించుకోమని చిలిపిగా నవ్వుతూ చెప్పినప్పుడూ నాది ఉత్త అనుమానమే కాదని తెలిసి పోయింది లెండి."

నా మనస్సు ఆశ్చర్యం లోంచి తేరుకోలేకపోతూంది!

నే నెన్నోసార్లు ఒక స్నేహితుల్లా అతనితో నవ్వుతూ ఫ్రీగా మాట్లాడుతున్నప్పుడూ...

ఒక్కోసారి కోపంతో చిన్న చిన్న చివాట్లేసినప్పుడూ...

అతను మరోలా వూహించుకున్నాడా?

నే నేవో సంకేతా లిస్తున్నానని అనుకున్నాడా?

ఎప్పటినుంచో అనుమానం ఉందట!

ఈ రోజు తేలిపోయిందట!

మనసంతా చేదుగా—అతి చేదుగా అయిపోయింది. సిగ్గుతో చితికిపోయి తల వంచేసుకున్నాను.

ఇప్పుడు నా ఎదురుగా ఉన్నది ఇన్నాళ్ళూ నేను పసివాడుగా భావించిన రవి కాదు.

ఇంకా ఇరవై ఏళ్ళు పూర్తిగా నిండకుండానే పురుషత్వం పూర్తిగా సంతరించుకున్న మగాడు! ఉత్త మగాడు.

"అంతలా సిగ్గు పడిపోతున్నారేంటి? వోహో! మీ అంతట మీరే కోరిక బయట పెట్టుకోవలసి వచ్చిందనా? ఇందులో అంత సిగ్గు పడవలసిన విషయం ఏముంది చెప్పండి? సంవత్సరం పాటు ఇంత దగ్గరగా మసలుతుంటే, నేచురల్ డిజైర్స్ ఎవరికైనా ఉంటాయి."

అంతవరకూ వూపిరి బిగపట్టుకొని వింటున్న నేను ఇక ఆగలేక గట్టిగా అరిచాను.

"షటప్!"

అతను టక్కున నోరు మూశాడు.

"ఇంతసేపూ నేను నోరు మూసుక్కూర్చున్నది నీ మాటలకి పరవశించిపోయి కాదు. ఇంతసేపూ విస్తు అంచనా వేస్తున్నాను ... ఈ సంవత్సరంలోనూ నువ్వు మాట్లాడిన కొన్ని వేల మాటల్లో తెలియని నీ స్వరూపం ఇప్పుడు నువ్వు మాట్లాడిన ఈ కొద్ది మాటల్లోనే తెలిసిపోయింది! ఇందాక వాడావు చూడు మాట—'నేచురల్ డిజైర్' అని—ఇంత చిన్నప్పుడే ఆ మాట ఎక్కడ నేర్చుకొన్నావో తెలియదు కాని, మరోసారి ఎవరి దగ్గరా వాడకు... ఆడదానికీ, మగాడికీ మధ్య అది తప్ప మరోటి ఉండదనుకొనే నీ స్వభావాన్ని అమాయకత్వం అనుకోవాలో, క్రూరత్వం అనుకోవాలో అర్థం కావటం లేదు.. నిన్ను తమ్ముడిలా వూహించుకొన్నాను... ఎట్సెట్రా... ఎట్సెట్రా డైలాగులు వెయ్యలేను ... కాని లైఫ్‌లో ముందు ముందు స్త్రీకి, పురుషుడికి మధ్య ఆ నేచురల్ డిజైర్ కాక మరికొన్ని భావాలు కూడా ఉంటాయని తెలుసుకో!"

నేను మాట్లాడతానని వూహించని వాడిలా అతను కాస్సేపు చేష్టలుడిగి నిల్చుండి పోయాడు. ఆ తర్వాత మాట్లాడకుండా బయటికి నడవబోయాడు.

"చూడు, రవీ." మృదువుగా పిలిచాను.

వెనక్కి తిరిగాడు.

పళ్ళెంలో ఉన్న పళ్ళనీ ... తాంబూలాన్నీ ... వంద నోటునీ అక్కడే ఉన్న సంచీలో పడేశాను. జడలోని మల్లెపూలు కూడా పీకేసి ఆ సంచీలో పడేశాను. సంచీ అతని చేతి కందించాను.

సంచీ అందుకొని అతను మౌనంగా బయటికి నడిచాడు.

ఆ తర్వాత మళ్ళా అతను నా కెన్నడూ కనపడలేదు.

అప్పుడే మగాళ్ళంటే అసహ్యానికి నా మనస్సులో మొదటి బీజం పడింది!

## 2

అవును మరి!

ఆ ఉంగరాల జుత్తూ ... ఆ కళ్ళూ...రవినే గుర్తుకు తెస్తున్నాయి.

అందుకేనేమో ఆ కుర్రాణ్ణిప్పట్నుంచీ చూస్తున్నంత సేపూ మనసంతా ఎందుకో తెలియని ఏహ్య భావంతో నిండిపోతోంది.

నిజానికి వాళ్ళదేం తప్పు?

మాటిమాటికి అలా చూడ్డమా? చూస్తూ మెల్లగా నవ్వుకొంటూ ఏదో చెప్పుకోవడమా?

తప్పుగా ఆలోచించి అనవసరంగా మనస్సుని పాడు చేసుకుంటున్నానేమో! కాని నా భావన తప్పని రుజువు చేస్తూ కాస్సేపట్లోనే ఆ కుర్రాడు నా దగ్గరి కొచ్చాడు.

నేను కూర్చున్న సీటు కెదురుగా నిల్చుని ట్రెయిను కుదుపుకి పడిపోకుండా పై బెర్తుని గట్టిగా పట్టుకొని నా వైపుకి వంగి అడిగాడు:

"డోర్నకల్‌లో దిగుతారా?"

"అవును" అన్నాను కాస్త నిర్లక్ష్యంగా. పని కట్టుకొని ఆ తలుపు దగ్గర్నించి వచ్చి అడగడ మెందుకో అర్థం కాలేదు.

"దిగడంలో ఏమైనా హెల్ప్ కావాలంటే చెప్పండి— నేనూ, నా ఫ్రెండూ సాయం చేస్తాం."

"నో,..థ్యాంక్సండి" అన్నాను ఇందాకటి నా నిర్లక్ష్యానికి సిగ్గుపడుతూ.

"మా ఫ్రెండు మీ అమ్మగారి చెయ్యి పట్టుకొని దింపేస్తాడు లెండి ... మరి మీరు ... మీకు హెల్ప్ కావాలంటే నేను చేస్తాను" అన్నాడతను నవ్వుతూ నా వైపు చూసి.

అర్థమయిపోయింది!


ట్రెయిన్‌లోంచి చెయ్యి పట్టుకొని దింపడానికి అతను పర్మిషన్ అడుగుతున్నాడు!

నా మొహం కోపంతో ఎర్రబడింది.

"థాంక్సండీ ... కొన్ని వందలసార్లు ట్రెయిన్‌లో ప్రయాణం చేశాను—నేను దిగిపోగలను' లెండి" అన్నాను కోపాన్ని కనపడకుండా ఉండనియ్యడానికి ప్రయత్నిస్తూ.

అతను మొహం కాస్త చిన్నబుచ్చుకొని మళ్ళా తలుపు వైపు నడిచాడు.

ట్రెయిన్ స్పీడు తగ్గింది. డోర్నకల్ స్టేష



నొచ్చేస్తోంది కాబోలు!

కిటికీ అద్దం మీది కెత్తాను... రివ్వున చల్ల గాలి మొహానికి కొట్టింది.

పైటకొంగు తలచుట్టూ తిప్పి కిటికీలోంచి తొంగి చూశాను. దూరంగా దీపాలు కనబడుతున్నాయి.

ఆ దీపాల్ని చూడగానే గుండె దడదడలాడింది ఒక్క క్షణం—పరీక్ష హాల్లోకి అడుగు పెట్టబోయే ముందు విద్యార్థి గుండెలా!

"అమ్మా...లే లే. స్టేషను వచ్చేస్తోంది." అమ్మని హడావిడిగా లేపాను.

కళ్ళు నులుముకొంటూ గబుక్కున లేచి కూర్చుంది అమ్మ ... వూడిన జుట్టుని ముడివేసుకొంటూ గాభరాగా అంది:

"స్టేషనొచ్చేసిందటే! గబగబా సామాన్లు తలుపు దగ్గర పెడదాం—పద... అట్టేసేపు ఆగదని కూడా అన్నావ్."

"నువ్వేం చెయ్యక్కర్లేదులేమ్మా ... ఇంకా స్టేషన్ రావడానికి కాస్త టైముందిలే. నువ్వెళ్ళి ఆ తలుపు దగ్గర నిల్చో ... ఈలోపున నేను సామాన్లు చేరవేస్తాను" అన్నాను చిరునవ్వుతో కసురుతూ.

అమ్మ మెమ్మదిగా తలుపు వేపు నడిచింది.

నేను గబగబా బెడ్డింగ్ చుట్టేసి, పై బెర్త్ మీది సూట్‌కేసులు రెండూ కిందికి దింపి, మర చెంబునీ, ట్రెయిన్‌లో కొన్న పత్రికల్నీ కేన్ బుట్టలో సర్దేశాను.

సామాన్లు ఒక్కొక్కటే తలుపు దగ్గిరికి చేర వేశాను.

ట్రెయిను నింకా స్లో అయింది. స్టేషన్‌లోని దీపాలు మరింత దగ్గరయ్యాయి. 'డోర్నకల్' అన్న పెద్ద అక్షరాలతో ఉన్న అవుటర్ కాబిన్ దాటింది ట్రెయిను. కుర్రాళ్ళిద్దరూ కనీసం తలుపు దగ్గర మందైనా అడ్డం లేకుండా ట్రెయిను ఆగిన వెంటనే ఎప్పుడు గెంతేద్దామా అన్నట్లు తల బాగా బయటకు పెట్టేసి చూస్తున్నారు.

ప్లాట్ ఫారమ్ వచ్చేసింది. ట్రెయిన్ అతి మెల్లగా వెళుతోంది.

ట్రెయినొస్తున్నా ప్లాట్ ఫారమ్ సందడిగా లేదు ఎందుకనో!

అమ్మ చెయ్యి పట్టుకుని ట్రెయిను ఆగే క్షణం కోసం ఎదురు చూస్తున్నాను. ట్రెయిను పూర్తిగా ఆగకుండానే కుర్రాళ్ళిద్దరూ ప్లాట్ ఫారమ్ మీదికి గెంతేశారు.

చెయ్యి పట్టుకుని దింపుతానన్న మహాను భావుడు కనీసం సామాన్లు దించడంలోనైనా సాయం చేసే కర్టెసీ లేదు!

అవును మరి...వాళ్ళిద్దరూ మగాళ్ళు! మే మిద్దరం ఒంటరి ఆడవాళ్ళం! ప్లాట్ ఫారమ్ మీది టీ స్టాల్సూ, పుస్తకాల షాపులూ, స్టేషన్ సిబ్బంది ఆఫీసులూ— అన్నిటినీ దాటుకుని అతి మెమ్మదిగా పోతూంది ట్రెయిను. ప్లాట్‌ఫారమ్ చివరన ఉన్న 'డోర్నకల్' అన్న బోర్డు కూడా దాటేసింది. ట్రెయిను వేగంకూడా పెంచింది.

అప్పటికి నా కర్థమయింది ట్రెయిను ఆ స్టేషన్‌లో ఆగదని.

గుండె దడదడ లాడింది!

అమ్మ చెయ్యి పట్టుకున్న నా చెయ్యి వణికింది.

"ఆదేమిటే, తల్లీ! ట్రెయిను ఆగలేదేంటే" అని అమ్మ గాభరాగా అరుస్తోంది.

ఆ అరుపుకి కంపార్ట్‌మెంట్‌లో కునుకు తీస్తున్న కొందరు బద్ధకంగా కళ్ళు విప్పి చూశారు.

"ఏమయిందండీ?" అన్నాడు కళ్ళు జోడు పెట్టుకున్న ముసలాయన!

"మేం ఈ స్టేషన్‌లో దిగాలండీ—ట్రెయిన్ ఆగలేదు" అన్నాను దుఃఖాన్ని దిగమింగుకుంటూ.

"చెయిన్ లాగండి" అన్నా రెవరో.

"వద్దండీ. ఈ కారణానికి చెయిన్ లాగితే—అనవసరంగా పోలీసులతో గొడవ. ఎక్స్‌ప్రెస్ ఖమ్మంలో ఆగుతుంది. అక్కడ దిగి వెనక్కొచ్చేయండి." ఇంకెవరో అన్నారు.

నా గుండె వేగంతోపాటు ట్రెయిను వేగంకూడా పెరిగింది!

ఇప్పుడు రాత్రి రెండు గంటలయింది! ఖమ్మం చేరేసరికి మరో గంట!

అక్కడినించి వెనక్కి రావడానికి ఎన్ని ట్రెయిను లున్నాయో? అసలు పొద్దున్న పది గంటల్లోపున చేరే ట్రెయిను లున్నాయో లేదో?

రాత్రల్లా ప్లాట్‌ఫారమ్ మీద నేనూ, అమ్మా ఎలా గడపాలో?

ట్రెయిను ఎక్కక ముందూ, ఎక్కిన తరవాతా కూడా పది సార్లు అందర్నీ కనుక్కుని బయలుదేరే నేను ఈ సారి మామయ్య దగ్గరుండి ఎక్కించడం వల్లనూ; మనస్సు నిండా ఉన్న టెన్షన్ వల్లనూ ఎవరినీ కనుక్కోలేదు! ఫలితం ఇంత కాస్ట్లీగా ఉంటుందనుకోలేదు.

బయలుదేరేముందు మామయ్య ఇచ్చిన అడ్రస్ కాగితం ఇంకా హేండ్‌బాగ్ లోనే ఉంది! అది మామయ్య స్నేహితుడిది. తిన్నగా వాళ్ళింట్లోనే దిగిపొమ్మనీ, అన్నీ ఆయనే చూసుకుంటాడని మామయ్య మరీ మరీ చెప్పాడు. ఏం లాభం?

ఇప్పుడు మేం ఖమ్మం వెళ్ళి వెనక్కి వచ్చేసినా రమారమి ఆఫీసు టైముకే అందుకుంటామేమో!

తెలియని వూళ్ళో దొరుకుతుందనుకున్న ఆసరా కూడా ఇక దొరకదు—ఆఫీసు కెళ్ళి అన్నీ నేనే చూసుకోవాలి!

ట్రెయిను స్టేషను వదిలి మూడు నిమిషాలయింది.

అయిపోయింది! నా గర్వం ... నా ఆశయాలు ... అన్నీ ఎగిరిపోవడానికి నో మూడు నిమిషాలు పట్టింది.

అమ్మ అప్పటికే తలుపు పక్కన పడేసిన బెడ్డింగ్ మీద కూలబడి పోయింది.


నూతన యవ్వనం పొందండి
సంతానవంతులు కండి. చర్మవ్యాధుల
నుండి విముక్తులు కండి.



హస్త ప్రయోగము వలన కలుగు నరముల బలహీనత, శీఘ్రస్ఖలనము అంగము చిన్నదగుట, అవసర కాలమందు అసంతృప్తి. సంతానము లేక పోవుట, సమస్త చర్మవ్యాధులకు అద్భుత చికిత్స పోస్టు ద్వారా చికిత్స కలదు.

క్యాంపులు: ప్రతి ఆదివారం భీమవరం. షణ్ముఖలాడ్జి నందు ఉ॥ 9 గం॥ నుండి సా॥ 6-30 గం॥ వరకు ప్రతినెల 1. మరియు 16. తేదీలలో "రాజమండ్రి" హోటల్ అప్సర లో మధ్యాహ్నం 12 గం॥ నుండి రాత్రి 9 గం॥ వరకు

డా॥ డి. మార్కండేయులు
ఆయుర్వేద భిషక్, సెక్స్ అండ్ స్కిన్ స్పెషలిస్ట్
పార్కు రోడ్, గుడివాడ-521 301
ఫోన్స్ 522 అండ్ 540

ఇంతలో ఎవరో చెయిన్ లాగినట్లు ట్రెయిను హఠాత్తుగా ఆగిపోయింది! ఒక్క క్షణం ఆశ్చర్యమో, భయమో, ఆనందమో తెలియని భావంతో మనస్సు నిండిపోయింది.

తలుపులోంచి తొంగి చూశాను. దూరంగా స్టేషన్‌లోని లైట్లు దేదీప్యమానంగా వెలుగుతూ కనిపిస్తూనే ఉన్నాయి.

ఒక నిశ్చయానికి వచ్చేశాను. ట్రెయిను బయలు దేరి మూడు నిమిషాలు కూడా కాలేదు. అట్టే దూరం వచ్చి ఉండదు! పైగా ప్లాట్‌ఫారమ్ మీది లైట్లుకూడా స్పష్టంగా కనపడుతున్నాయి! అట్టే చీకటిగాకూడా లేదు. ఇక్కడ దిగిపోతే ఈ లైన్ల వెంబడి అతి సులువుగా నడిచి పోవచ్చు. మహా అయితే అరగంట కంటే ఎక్కువ టైమ్ పట్టదు. జీవితంలో అతి ముఖ్యమైన మలుపు దగ్గర తీసుకుంటున్న నిర్ణయం! జంకకూడదు.

"పదమ్మా ఇక్కడ దిగిపోదాం. ఇక్కడినుంచి స్టేషన్ దాకా నడిచేద్దాం" అన్నాను అమ్మతో.

"నీకేమైనా మతి పోయిందటే— ఈ చీకట్లో ఇక్కడ దిగిపోయి.." అమ్మ ఇంకేదో చెప్పబోతూంది. నేను అమ్మ మాటల్ని మధ్యలోనే అందుకుని ప్రాధేయ పూర్వకంగా అన్నాను.

"అమ్మా... ఈ టైములో మాత్రం నన్ను అడ్డు పెట్టకు—ప్లీజ్. ఇక్కడ మనం దిగిపోవడం మీదే మనిద్దరి భవిష్యత్తు ఆధారపడి ఉంది. చిన్నప్పటినుంచి నీ మాటే వింటున్నాను. ఈ ఒక్క సారీ నా మాట విను."

గబగబా సామాన్లన్నీ ద్వారానికి దగ్గరగా జరిపేసి కిందికి దిగిపోయి ఒక్కొక్క సామాన్నే దింపేశాను. తర్వాత అమ్మని కూడా చెయ్యందించి దింపేశాను.

ఇందాక మాకు సలహా చెప్పిన ముసలాయన వింతగా మా వైపు చూస్తున్నాడు. నేను ఎవర్నీ లక్ష్యపెట్టదలచుకోలేదు. ఆ క్షణంలో నా లక్ష్యం ఒక్కటే—పొద్దున్న పది గంటల్లోపున ఆ ఆఫీసులో ఉండాలి!

ట్రెయిన్ కూత వేసి కదిలింది. ఒక్కొక్కటే కంపార్ట్‌మెంట్లు దాటిపోతున్నాయి.

ఆ క్షణంలో చెయిను లాగి ట్రెయినాపిన మహానుభావు డెవరో కాని అతనికి మనస్సులోనే కృతజ్ఞత చెప్పుకొన్నాను కదిలే ట్రెయిను వైపు చూస్తూ.


ఆఖరి కంపార్టుమెంటు కూడా దాటిపోయింది. ఆఖరి కంపార్ట్‌మెంట్లో నిల్చుని ఆకుపచ్చ దీపం వూపుతున్న గార్డు ఏదో అరిచాడు. కాని ట్రెయిన్ చప్పుళ్ళో అర్థమవలేదు!

పచ్చదీపం కూడా దాటిపోయింది!

అప్పుడు మిగిలింది చీకటి! కటిక చీకటి! అంత చీకటిగా ఉంటుందని ఈషణ్మాత్రమైనా వూహించ లేదు!

ట్రెయిను ఆగి ఉన్నప్పుడు కంపార్ట్‌మెంట్లలోని లైట్లవెలుగు బయట పడి ఆ ప్రదేశమంతా వెలుగుగా ఉన్నట్లు భ్రమ కలిగించింది. ట్రెయిన్‌తోబాటు వెలుగూ, వెండీ కూడా పోయాక ఆ చీకటి మరింత ఎక్కువగా అనిపిస్తోంది!

అయినా నా కొక్కటే ధైర్యం! ఎదురుగా




స్టేషన్‌లోని కాబిన్ మీది పసుపుపచ్చని లైటు దేదీప్యమానంగా కనిపిస్తోంది.

బాగులో పెద్ద టార్చిలైటుంది! ఆ రెండూ చాలు!

అమ్మ నా చెయ్యి గట్టిగా పట్టుకొంది. నేను బాగ్‌లోంచి టార్చిలైటు తీసి అమ్మచేతి కిచ్చాను.

"మరేం భయంలేదు, పదమ్మా...వో పావుగంట, ఇరవై నిమిషాలు నడిచామంటే స్టేషనుకి చేరు కొంటాం" అన్నాను రెండు చేతుల్తో రెండు సూట్‌కేసులు తీసుకుని, ఎయిర్‌బ్యాగ్ భుజానికి తగిలించు కొంటూ.

అమ్మ సేము బుట్ట చేతిలోకి తీసుకొంది. అమ్మని కష్టపెడుతున్నానేమో! తప్పదు!

"ఇంత చీకట్లో ఎలా వెళ్తామో ఏమోనే, తల్లీ... మధ్యలో పురుగూ పుట్రా ఏమైనా ఉంటాయేమో!" అంది అమ్మ, వణుకుతున్న గొంతుతో.

"చేతిలో టార్చిలైటుందిగా—మరేం ఫర్వాలేదు. అయినా మనం పట్టాల మధ్య నించి నడుస్తాంకదా. అక్కడేం ఉండవులే" అన్నాను.

ఇద్దరం కదిలాం. ఆ క్షణంలో నేను దేముణ్ణి ప్రార్థించింది ఒక్కటే! 'దేముడా! దారిలో పురుగూ పుట్రా ఎదురైనా ఫర్వాలేదు. తప్పించుకుని పోతే అవేం చెయ్యలేవు. ఈ చీకట్లో మనిషి ఎదురు పడ కుండా చెయ్యి. మగాడు... మగాడు ఎదురుపడకుండా చెయ్యి...' మనఃస్ఫూర్తిగా ప్రార్థించాను.

కాని నా ప్రార్థనని దేముడు వినలేదు!

"ఎవరండీ అది? ఈ చీకట్లో దిగిపోనారేంటి?" అన్న బొంగురు గొంతు వినిపించింది.

ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూశాను.

దాదాపు ఆరడుగుల పొడవుతో, చీకట్లో కలిసి పోతున్న నలుపుతో, మోకాళ్ళ మీదికి బిగించి కట్టిన గోచీతో, చేతిలో వో ఇనప పెట్టెతో నిల్చుని ఉన్నా డతను!

అయిపోయింది! నేనేది జరక్కూడ దనుకున్నానో అదే జరిగిపోయింది! గట్టిగా కేకలు వేసినా వినిపించని నిర్జన ప్రదేశంలో పాతికేళ్ళు నిండిన నేనూ ... యాభై ఏళ్ళున్నా ఇలా ఎడం చేత్తో తోసేస్తే పడిపోయేంత బలహీనంగా ఉన్న అమ్మా ... పశు బలంతో ఉన్న వో మగాడూ ...

"నువ్వుకూడా రైల్లోంచే దిగావా, బాబూ!" అమ్మ అతని వైపు తిరిగి అడుగుతోంది.

ఒక మనిషి తోడు దొరికినందుకు అమ్మ గొంతులో చెప్పలేనంత రిలీఫ్ కనిపిస్తోంది! అవును మరి—గొర్రె కసాయి వాడినే నమ్ముతుంది! పిచ్చి అమ్మ!

"అవునండీ—డోర్నకల్లో దిగాల... అక్కడ ఈ బండి ఆగదని తెల్వదు... గిట్ట కొద్ది దూరం పొంగానే బండి ఆగిపోయె... ఇక్కడి నుండి నడిచి పోవచ్చులే అని దిగిపోయినా" అన్నా డతను.

అతను మాట్లాడుతుంటే నాటు సారా వాసన గాలిలో తేలి వచ్చి ముక్కుపుటాలను తాకింది. ఒళ్ళు జలదరించింది!

"ఇందాకట్నించి ఆడవాళ్ళం ఇద్దరం అంత దూరం ఎలా నడిచి వెళ్ళగలమా అని ఆలోచిస్తున్నాను, నాయనా... మా అమ్మాయేమో ఒట్టి మొండిది! ఇక్కడెందుకు దిగడమమ్మా అన్నా వినిపించుకోదు. ఏదో దేముళ్ళా నువ్వు మాకు తోడు దొరికావు కాబట్టి సరిపోయింది."

మా పక్కగా నడుస్తున్న అతనితో అమ్మ ఆనందంగా చెప్పేస్తోంది! నా కొక్కసారి కోపం ముంచు కొచ్చింది—అర్ధరాత్రి ఎవడో ముక్కూ మొహం తెలియని వాణ్ణి దేముళ్ళా పొగిడేస్తూ అతని వెంటే నడుస్తున్నందుకు!

కాని నా విసుగుని బయటకు కనబడనియ్యలేదు. స్టేషన్ చేరేదాకా అతనితోబాటు నడవక తప్పదు!

తప్పించుకొని దూరంగా పారిపోలేను. ఇంకో దారంట స్టేషన్‌కి వెళ్ళలేను. మా వెంబడే ఎందు కొస్తున్నా వయ్యా అని అతన్ని నిదిలించలేను.

అలా చేసే అధికారమూ నాకు లేదు.

అతను అమ్మ దగ్గర్నుండి నా పక్కకు వచ్చి దగ్గరగా నిల్చున్నాడు.

నా గుండె గుభిల్లుమంది!

(సశేషం)

పెద్దకథ

# మనిషిలో మనిషి

## అవధానుల విజయలక్ష్మి

(క్రిందటి సంచిక తరువాయి)

"ఆడోళ్ళు... గంత దూరం ... ఈ బర్వులెట్ల మోసుకుపోతరు? నా కియ్యండ్రి గా రెండు పెట్టెలు. బిస్తర నేను పట్టుకొంట" అన్నాడు.

నేను నిస్సహాయంగా అమ్మ వైపు చూశాను.

రెండు పెట్టెలు ... అందులో ఒక పెట్లో నేను నాలుగేళ్ళు బట్టీ చెమటోడ్చి సంపాదించిన డబ్బులతో కొనుక్కొన్న కాసిని మంచి చీరెలూ ... అమ్మవి కొన్ని బట్టలూ ... అక్కడి ఖర్చులకని మామయ్య ఇచ్చిన రెండు వందలు ఉన్నాయి.

మరో పెట్లో నా మూడేళ్ళ కష్టానికి ఫలితంగా సంపాదించిన డిగ్రీ సర్టిఫికేట్లూ, టైపు షార్ట్ హేండ్ల సర్టిఫికేట్లూ ... నేను అతి జాగ్రత్తగా దాచుకొన్న కొన్ని అమూల్యమైన పుస్తకాలూ ఉన్నాయి!

ఆ రెండు సూట్‌కేసులూ పట్టుకొని అతను గబుక్కున పారిపోతే నేను కనీనం అతన్ని అందుకోనైనా అందుకోగలనా?

దొంగ, దొంగ అని అరిచినా వినిపించుకోడానికి చుట్టూ చీకటి తప్ప మరో పిట్ట మనిషి కూడా లేడుకదా!

"ఫర్వాలేదులే—నేను పట్టుకోగలను" అన్నాను. అన్నానే కానీ నాలో నేనే నవ్వుకొన్నాను. సూట్‌కేసులు అతని చేతికి అందించనంత మాత్రాన అతను లాక్కొని పారిపోలేడూ?

"ఇంకా మూడు మైళ్ళు నడవాల ... గంత దూరం ఏం మొయ్యగలరు? ఫర్వలేదు—ఇచ్చేయండ్రి" అన్నా డతను నాకు మరింత దగ్గరగా వచ్చి పెట్టెలు అందుకోడానికి సిద్ధంగా నిలబడుతూ.

మూడు మైళ్ళు! మైగాడ్! అంత దూరముంటుందా?

ఇందాక ట్రెయిన్లోంచి చూసి నో మైలు కంటే ఎక్కువ ఉండదనుకొన్నాను!

స్టేషన్‌లోని లైట్లు నన్నెంత భ్రమ పెట్టాయి! అయినా ఈ పల్లెటూరి మనిషి చెప్తున్న విషయాన్ని ఎంతవరకు నమ్మొచ్చునో? అవును—ముప్పై మైళ్ళ వేగంతో ట్రెయిను రమారమి అయిదు నిమిషాల పాటు ప్రయాణం చేసింది ...అంటే మూడు మైళ్ళ దూరం వచ్చేసింది!

ట్రెయిన్‌లోంచి దిగక ముందు ఇంతగా లెక్కలు కట్టలేదేం?

భ్రమ! కేవలం భ్రమ! స్టేషన్‌లోని లైట్లు కలిగించిన భ్రమ!

జీవితంలో ఈ నిర్ణయం తీసుకోకపోతే కలిగే ఫలితాలను గురించిన ఆందోళన! నేను తెలివితక్కువ పని చేశానా? ఏమో?

ఇక్కడ ఈ మనిషి ఇలా ప్రత్యక్షం కావడంవలన ఏం కోల్పోబో తున్నానో? ఇలా ప్రత్యక్షం కాకపోతే ఏం కోల్పోవలసి వచ్చునో?

"ఇంకా ఏమిటి ఆలోచిస్తున్నావే? పాపం, అతను పట్టుకొంటా నంటున్నాడుగా—ఇచ్చేయ్" అంది అమ్మ నా ఆలోచనలని భగ్నపరుస్తూ.

నేను రెండు సూట్‌కేసుల్నీ నేల మీద పెట్టేశాను. పెట్టెల మీద బెడ్డింగ్‌ని పెట్టేశాను. అతను వంగి ఒక్కొక్క సామానూ తలమీద పెట్టుకొన్నాడు. సామాను అందుకొంటున్నప్పుడు అతని చేతి మీదికి ఫోకస్ చేసిన టార్చిలైటు వెలుగులో దట్టంగా వెంట్రుకలతో ఉన్న మోటు చేతులు నల్లగా నిగనిగలాడుతూ కనిపించాయి.

అతను ఆ మూడు సామాన్లూ తీసుకొన్నాక అమ్మ దగ్గరున్న పేము బుట్టని నే నందుకొన్నాను.

మూడు మైళ్ళు ఇంత బరువుల్ని మోస్తూ నేనూ, అమ్మా నడవ గలిగే వాళ్ళమా? అసలే బలహీనంగా ఉంది అమ్మ. బరువుని మోస్తూ సగం దూరంలోనే దాహంతో, నీరసంతో కళ్ళు తిరిగి పడిపోతే?

చీకట్లో ఒంటరిగా రైలు పట్టాల మధ్యగా నేనేం చెయ్యగలిగేదాన్ని? అతను సామాన్లు నెత్తిమీద పెట్టుకొని కాస్త ముందుకు నడిచాడు.

అమ్మ నా పక్కకి వచ్చి కాస్త గుసగుసలాడుతున్నట్లు అంది:

"అతనికి సామాన్లు అందించటానికి అంత మొహమాట పడిపోతా వేమిటే? అక్కడికి చేరుకొన్నాక అతనికి కాస్తో కూస్తో డబ్బు లిద్దాం..."

పాపం, పిచ్చి అమ్మ! డబ్బులు గురించే అత నా సామాన్లని తలకెత్తుకొన్నాడని అనుకొంటోంది!

అతను గబగబా ముందు నడుస్తున్నాడు. అమ్మ నా వెనుక నడుస్తోంది. అమ్మకి నేను టార్చిలైటు చూపెడుతున్నాను.

టార్చిలైటు వెలుగు ఒక్కోసారి అతని కాళ్ళమీద కూడా పడుతోంది. నల్లగా మోటుగా ఉన్న కాళ్ళు... చకచకా క్రమబద్ధంగా అడుగులు వేస్తున్నాయి.

సరిగ్గా ఏడాది క్రిందట... ఇలాటి రాత్రే ... ఇలాటి చీకట్లోనే ఒకరితో నడిచాను.

కాని ఇతని ఒంటిమీద మాసిపోయిన గోచీ ... చిరిగిన బనియనూ తప్ప మరేం లేవు.

అతని ఒంటిమీద ఖరీదైన పంచె, కళ్ళలాల్చీ ఉన్నాయి.

ఇతను ఆరడుగులకి మించిన పొడుగుతో, అంతకు మించిన బలంతో ఉన్నాడు. అతను పొట్టిగా, సన్నగా ఉన్నాడు.

ఇతనికి అక్షరం ముక్క వచ్చునో, రాదో తెలియదు. అతను సంస్కృత శ్లోకాలు అనర్గళంగా చదివేవాడు. ఇతని మొహం చూస్తుంటే ముప్పై అయిదేళ్ళ కంటే ఎక్కువ ఉండవేమో ననిపిస్తోంది! అతనికి యాభై ఏళ్ళకి పైనే ఉంటాయని నాకు తెలుసు! ఇప్పుడు నడుస్తున్నది నిర్జనమైన మైదానం మధ్య నించి! అప్పుడు నడిచినది నిర్మానుష్యమైన నగరపు వీథుల్లోంచి!

**3**

అప్పుడు కూడా ఇలాగే ఆఖరి నిమిషంలోనే బయల్దేరవలసి వచ్చింది. మర్నాడు పొద్దున్న ఇంటర్వ్యూ! సాయంత్రం అందిం దా ఉత్తరం ఆ రోజులు అలస్యంగా! పక్క వూర్లోనే కాబట్టి ఫర్వాలేదు. గంటన్నర, రెండు గంటల ప్రయాణం. మర్నాడు పొద్దున్న బయల్దేరి సరిగ్గా ఇంటర్వ్యూ టైమ్‌కి వెళ్ళేకంటే సాయంకాలమే వెళ్ళిపోయి అక్కడ నా స్నేహితురా లింట్లో గడిపేయడం మంచిది అనుకొన్నాను.

సాయంత్రం ఆరు గంటలకో బస్సుంది. అది దాటితే రాత్రి పదిన్నర దాకా మరో బస్సు లేదు. పదిన్నర బస్సు అక్కడికి చేరుకునే సరికి అర్ధరాత్రి అయిపోతుంది. ఆ టైములో స్నేహితురాలింటిని వెతుక్కుంటూ ఏ రిక్షాలోనో వెళ్ళలేను! ఆరు గంటల బస్సయితే ఏడున్నర, ఎనిమిది గంటల కల్లా అక్కడికి చేరుకుంటాను.

అందుకే ఎవరినీ తోడు తీసుకెళ్ళకుండా ధైర్యంగా ఒంటరిగా బయలుదేరాను. బస్సు బయలుదేరింది.

సాయంత్రపు చల్లగాల్లో ఎగురుతూ పెడుతున్న ప్రపంచాన్ని చూస్తూ, చేయబోయే ఇంటర్వ్యూ గురించీ, రాబోయే ఉద్యోగం గురించీ, వచ్చే జీతం గురించీ, అమ్మని సుఖపెట్టడం గురించీ ఆలోచిస్తున్నాను. సరిగ్గా నలభై నిమిషాలు ప్రయాణం చేశాక నేను చేరవలసిన గమ్యం సరిగ్గా సగం దూరంలో ఉండగా బస్సు సడన్ బ్రేకుతో ఆగిపోయింది— నా కలలకి ఆనకట్ట పడింది.

బస్సులో అందరూ కిందికి దిగి ఆత్రతగా చూస్తున్నారు.


అప్పటికే చిరు చీకట్లు ముసురుకుంటున్నాయి.

నేను సీట్లో కూర్చునే కిటికీ లోంచి చూస్తున్నాను.

బస్సు ముందు మూగిన గుంపులోంచి ఒక్కొక్కరే వచ్చేస్తున్నారు.

అందరి మొహాల్లోనూ చెప్పలేనంత విసుగు కనపడుతోంది.

ఒకరిద్దరు బస్సెక్కి సామాన్లు తీసుకుని వెళ్ళిపోయారు.




"ఏముయిందండీ?" బస్సు పక్కగా నిలుచున్న ఆయన్ని అడిగాను.

"ఫ్రంట్ ఆక్సిల్ విరిగి పోయిందండీ. బస్సు నడవదు!" అన్నా డతను.

నాకు చెప్పలేనంత నీరసం ముంచు కొచ్చింది. ఈ బస్సు రిపేరు అయి బయలుదేరేసరికి ఎంత టైమ్ పడుతుందో?

నేనుకూడా బస్సు దిగాను. రోడ్డు పక్కగా రాయిమీద కూర్చుని బీడీ కాల్చుకుంటున్న కండక్టరు దగ్గరికి నడిచాను.

"ఈ బస్సు ఇంకా ఎంత సేపట్లో బయలు దేరుతుంది?" అడిగాను.

"ఆక్సిల్ విరిగిపోయింది కదండీ! విజయవాడ వెళ్ళే వైపు బండి ఏదైనా వస్తే దాంట్లో మనిషిని పంపిస్తాం. అక్కడినుంచి కొత్త ఆక్సిలు కొని తెచ్చాక మారుస్తాం. అసలు ఇప్పటిదాకా అటువైపు వెళ్ళే బండేదీ రాలేదు కదండీ! మనిషి వెళ్ళి కొత్త ఆక్సిలు తెచ్చి బిగించేసరికి ఏ అర్ధరాత్రో అవుతుంది" అన్నాడతను తాపీగా.

"ఏమిటీ! అర్ధరాత్రి దాకా బస్సు బయలు దేరదా?" ఆత్రతగా అడిగాను.

"అవునండీ. అయినా అక్కడివించి పదిన్నరకి బయలుదేరే బస్సుందిగా. ఇక్కడి కొచ్చేసరికి పదకొండుం పావో పదకొండున్నరో అవుతుంది. అందులో వెళ్ళిపోవచ్చు. చాలామంది ప్రయాణీకులు అలాగే చేద్దామని చూస్తున్నారేండి" అన్నా డతను.

విజయవాడ చేరేసరికి అర్ధరాత్రయి పోతుందని రాత్రి బస్సులో కాక సాయంత్రం బస్సులో బయలుదేరాను, అమ్మని హడావిడి పెట్టేసి, నేను హడావిడి పడిపోయి. తీరా ఇప్పుడు ఆ బస్సు లోనే వెళ్ళవలసి వస్తూంది.

ఒక్కటే ధైర్యం—బస్సులో నాతోపాటు చాలా మంది ఉన్నారు— వాళ్ళందరితో పాటే నేనూను!

కాని అర్ధరాత్రి స్నేహితురాలింటికి వెళ్ళలేను! రాత్రంతా ఆ బస్టాండులోనే గడపాలి!

నాకు తోడుగా చాలా మంది ఉన్నారన్న ధైర్యం కొద్ది సేపట్లోనే సడలి పోయింది!

బస్సులోంచి దిగిన వాళ్ళలో సగం మంది బస్సులో కెక్కి సామాన్లు దించేసుకుని రోడ్డు పక్కగా ఉన్న మట్టి బాట మీదుగా వెళ్ళిపోయారు.

"వాళ్ళందరూ ఈ చుట్టు పక్కల ఊళ్ళకి వెళ్ళే వాళ్ళండీ!" అన్నాడు కండక్టరు నా మొహం లోని సందేహం గమనించి.

'పోనీలే, సగం మంది వెళ్ళిపోయినా ఇంకా సగం మంది ఉన్నారు' అనుకున్నాను నిశ్చింతగా.

ఆ సగం మందీ కొందరు రోడ్డుపక్క నున్న రాళ్ళమీదా, కొందరు బస్సులోనూ కూర్చున్నారు.

నేనుకూడా మళ్ళీ బస్సెక్కాను.

ఐదు నిమిషాలు గడిచాయి.

"ఒరేయ్! అర్ధరాత్రిదాకా తిండీ తిప్పల్లేకుండా ఈ బస్సులో ఎంతకని కూర్చుంటాం? అలా వూళ్లో కెళ్ళి ఏదైనా తిని వద్దాం. అక్కడినుంచి రైల్వే స్టేషను కెళ్ళి ఒకవేళ ఏదైనా ట్రెయినుంటే వెళ్ళిపోవచ్చు."

బస్సులో కూర్చున్న ముసలాయన నాకడు కిటికీ లోంచి చూస్తూ, వాళ్ళ కొడుకు కాబోలు రోడ్డు పక్కగా కూర్చున్న యువకుణ్ణి ఉద్దేశించి అరిచి చెప్పాడు.

ఆ యువకుడు బస్సు దగ్గరగా వచ్చాడు.

"అయినా ఇప్పుడు ట్రెయిన్లేమున్నాయండీ?" బస్సులోనే కూర్చున్న ఆయన భార్య కాబోలు అడిగింది.

"మరో గంటలో ఒక లోకల్ ట్రెయిను ఉన్నట్లు గుర్తు." మరెవరో జవాబు చెప్పారు.

"అవును సుమండీ... అర్ధరాత్రి దాకా ఇక్కడ పడిగాపులు పడేకంటే, వూళ్ళో కెళ్ళి నాలుగు మెతుకులు కొరికి ఏ ట్రెయినో పట్టుకుని పోవడం మేలు." ఇంకెవరో అన్నారు.

"అయితే పదండి. ఏమండోయ్! మీరూ వస్తారా?" ఒకరొకరు అడుగుతూ మొత్తం మీద అందరూ బయలుదేరడానికి సిద్ధమయ్యారు.

"ఏమ్మా, నువ్వూ వస్తావా?" ఇందాకటి ముసలావిడ నా దగ్గరి కొచ్చి అడిగింది.

నా మనస్సు ఒక్క క్షణం అటూ ఇటూ వూగిసలాడింది.

కడుపులో ఆకలి కరకరలాడుతున్న మాట నిజమే కాని, ఇప్పుడు భోజనం కాదు సమస్య!

బస్సులో అందరూ దిగిపోయాక మరో నాలుగైదు గంటలు ఆ కండక్టరు, డ్రైవర్లతో పాటు ఒంటరిగా కూర్చోవాలి!

పోనీ, అందరితోపాటు వూళ్లోకి వెళ్ళిపోతే?

తీరా అక్కడ కెళ్ళాక ట్రెయిను దొరక్కపోతే? బస్సు దగ్గిరికి ఎవరూ తోడు రాకపోతే? పోనీ, ట్రెయిను మిస్సయి ఎలాగోలా వచ్చేసినా ఇక్కడ బస్సుకూడా మిస్సయితే?

తెల్లారేదాకా బాగవని ఈ బస్సులో కూర్చుండి పోవాలి!

చేతిలోని అవకాశాన్ని వదిలేసుకుని, చేతిలో లేని దాని గురించి పరిగెత్తడ మెందుకూ?

తరవాతి బస్సొచ్చే దాకా అక్కడ బస్సులో కూర్చుందికే నిర్ణయించుకున్నాను.

"నేను రానండీ. బస్సు బయలుదేరేదాకా ఇక్కడే కూర్చుంటాలెండి" అన్నాను దృఢంగా.

ఆవిడ నా దగ్గరగా వచ్చి కాస్త రహస్యంగా అన్నట్లు అంది.

"చూడమ్మా! ఒక్కర్తెవూ అంత అర్ధరాత్రిదాకా కూర్చోగలవా? ఈ రోజుల్లో ఎవర్నీ నమ్మలేం. ఆ కండక్టరూ, డ్రైవరూ చూడ్డానికి మంచివాళ్ళ లాగే ఉన్నారనుకో. కాని..." అంటూ అర్ధోక్తితో ఆగిపోయింది.

"ఫరవాలేదండీ. రేపొద్దున్నే ఇంటర్వ్యూ ఉంది. ఇప్పుడు వూళ్లోకి వెళ్ళినా తీరా అక్కడినుంచి ట్రెయిన్లేకపోతే నేను ఇంటర్వ్యూకి అందుకోలేను. తలుపు లోపలినుంచి లాక్ చేసేసుకుని కూర్చుంటా లెండి!" అన్నాను ధైర్యంగా.

"నీ ఇష్టమమ్మా చెప్పాల్సింది చెప్పాను" అందావిడ సామాన్లు తీసుకుని బస్సు దిగుతూ.

ఒక్కొక్కరే వచ్చి బస్సులోని సామాన్లు తీసుకుని దిగిపోయి రోడ్డు పక్కనున్న మట్టి బాట వెంట సాగిపోయారు.

ఆఖరికి ఒంటరిగా మిగిలింది నేనే!


అందరూ వెళ్ళిపోయి ఐదారు నిమిషాలైపోయాక గుర్తొచ్చింది "డోర్ లాక్ చేసుకుని కూర్చుంటా" నన్నది. ఎంత తెలివి తక్కువ మాటో.


పాసింజర్లు కూర్చునే వైపు లాక్ చేసెయ్యగలను. మరి డ్రైవరు సీటు దగ్గరున్న తలుపో?

నేను చేసింది తెలివైన పనో తెలివి తక్కువ పనో తెలియలేదు చాలా సేపటివరకూ!

బస్సుకి దూరంగా కూర్చుని బీడీలు కాల్చుకుంటున్న డ్రైవరూ, కండక్టరూ మిత్రులో శత్రువులో తెలియదు!






ఎవ్వరైనా నమ్మక తప్పదు!

''కాస్సేపునడుం వాలుద్దాం పద గురూ!'' దూరం నించి కండక్టరు డ్రైవరుతో అంటున్న మాటలు వినిపించాయి.

చీకట్లో ఇద్దరూ బస్సు వైపు రావడం కనిపిస్తోంది.

బస్సు దగ్గరి కొచ్చి ఎక్కబోతూ నన్ను చూసి చటుక్కున ఆగిపోయాడు కండక్టరు.

నా అరచేతుల్లో పడుతున్న చెమటని పైట కొంగుతో తుడుచుకున్నాను.

''అరె! అందరితోనూ మీరూ వూర్లోకి వెళ్ళలేదు టండీ'' అన్నాడు కండక్టరు ఆశ్చర్యంగా.

''లేదు. నెక్స్ట్ బస్సు ఇక్కడ ఆపించుతామని చెప్పారుగా. అందులో వెళ్ళిపోతాను'' అన్నాను

అతనొక్క క్షణం మౌనంగా ఉండి—

''సర్లెండి. ఆ బస్సు రాగానే ఆపించి మిమ్మల్ని ఎక్కించే పూచీ నాదీ. మేమిద్దరం ఆ ముందు సీట్లలో నడుం వాలుస్తాం'' అభ్యంతరమా? అన్నట్లు చూస్తూ అడిగాడు.

''కాని బస్సు మాత్రం ఆపి ఎక్కించాలి. రేపొద్దున్న నాకు అర్జెంటు పని ఉంది'' అన్నాను.

''అలాగే ఒక గంట ఇలా కునుకు తీసి లేచిపోతా లెండి. మీరుకూడా మీ సీట్లో రెస్టు తీసుకోండి. బస్సు రాగానే లేపుతాం'' అన్నాడు బస్సెక్కి ముందు సీట్ల వైపు నడుస్తూ.

నేను మాత్రం పడుకో లేదు. కిటికీ అద్దం తీసేసి కిటికీ పక్కగా కూర్చున్నాను. బస్సులో లైట్లు మందంగా వెలుగుతున్నాయి. ఆ మసక వెలుగులోనే నేను తెచ్చుకున్న పుస్తకం తీసి చదవడానికి ప్రయత్నించాను. రోడ్డు బొత్తిగా నిర్మానుష్యంగా లేదు! అప్పుడప్పుడు ఒకటీ రెండు కార్లూ,స్కూటర్లూ రోడ్డుమీంచి పోతున్నాయ్.

అప్పుడప్పుడు మనుష్యులుకూడా వెళుతున్నారు. వెళుతున్న వాళ్ళు ఆగి ఉన్న బస్సునీ, అందులో కిటికీ పక్క కూర్చున్న నన్నూ కాస్సేపు వింతగా చూసి ముందుకి కదులుతున్నారు.

అరగంట గడిచింది! ఇంకా మూడు గంటలు గడవాలి!

సమయం అంత దీర్ఘంగా అనిపించటం అదే మొదటిసారి.

నిద్ర ముంచుకు వస్తోంది. కాని నిద్రపోకూడదు.

చదువుతున్న జనరల్ నాలెడ్జి పుస్తకాన్ని బాగులో పడేసి మరో వారపత్రిక తీశాను.

బస్సు పక్కగా అడుగుల చప్పుడు వినిపించింది

కాస్సేపటికి ఆ మనిషి నేను కూర్చున్న కిటికీ దగ్గరికి వచ్చేశాడు.

అతను నా వైపే నడుస్తూ కాస్తంత ముందుకు వెళ్ళి మళ్ళా వెనక్కి వచ్చాడు.

ఎక్కడో చూసిన మొహమే! ఆ మనిషితో బాగా పరిచయం ఉన్నట్లే అనిపిస్తోంది.

ఏభై ఏళ్ళకి పైబడ్డ వయస్సు. తెల్లగా పొట్టిగా ఉన్నాడు. తెల్లటి లాల్చీ, ధోవతీ... ఎవ రీయన? ఆలోచిస్తున్నాను.

అతను నా దగ్గర కొచ్చాడు.

''మీది గుంటూరు కదమ్మా?'' అడిగాడు.

ఆ స్వరమూ పరిచయమైనదే.

''అవునండీ'' అన్నాను మర్యాదగా.

''నువ్వు సూరిబాబుగారి కూతురివా?'' అడిగాడు.

''నన్ను గుర్తు పట్టలేదూ? మీ మామయ్యగారింటికి అప్పుడప్పుడు భజనల కొస్తుంటాను.''

నా కప్పుడు గుర్తొచ్చింది!

మా మామయ్యకీ, అత్తయ్యకీ ఇద్దరికీ భక్తి ఒక పాలు ఎక్కువే! ప్రతి వారం క్రమం తప్పకుండా సాయంత్రం ఒక గంట భజన చేస్తారు వాళ్ళింట్లో. పైగా ప్రతి కృష్ణాష్టమికి వాళ్ళింట్లో ఏకాహంకూడా చేస్తారు.

ఆ సమయాల్లో ప్రసాదాలు పంచి పెట్టడం లాంటి పనులన్నీ చేసేది నేనే. ఆ భజనలకి తెలిసిన వాళ్ళూ, తెలియని వాళ్ళూ చాలామంది వస్తుంటారు. అందులో కొందరి పేర్లు మా మామయ్యక్కూడా తెలియవు!

భజనల్లో రెండు మూడు సార్లు ఈయన్ని చూశాను.

భజన మధ్యలో భాగవతంలోని శ్లోకాలని శ్రావ్యంగా చదవడం రెండు మూడు సార్లు విన్నాను.

ఆ క్షణంలో ఆయ నక్కడ కనిపించడం చెప్పలేనంత రిలీఫ్ కలిగించింది!

''మీది ఈ వూరాండీ?'' అడిగాను.

''లేదమ్మా—మాది విజయవాడ. గుంటూరుకి అప్పుడప్పుడు పనిమీద వస్తుంటాను. వచ్చినప్పుడల్లా మీ మామయ్యగారింట్లో భజన్లంటే హాజరవుతూ ఉంటాను. ఒక స్నేహితుడి ద్వారా తెలిసిందిలే మీ మామయ్యగారింట్లో జరిగే భజనల గురించి. అన్నట్లు ఈ బస్సు ఇక్కడ ఆగిపోయిందేమిటి? బస్సులో నువ్వొక్కత్తివే కూర్చున్నావే?'' ఆదుర్దా నిండిన గొంతుతో అడిగాడు.

ఆ తెలియని ప్రదేశంలో తెలిసిన ఒక మొహం కనిపించిన ఆనందంలో జరిగిందంతా చెప్పేశాను.

''చాలా పొరపాటు చేశావమ్మా. అందరితోపాటు వూర్లోకి వెళ్ళిపోవలసింది—ఇక్కడి మనుష్యుల్ని నమ్మలేమమ్మా'' అన్నాడు.

''ఇంటర్వ్యూ మిస్సయి పోతానేమోనని భయపడ్డానండీ.''

ఆయన చిన్నగా నవ్వాడు.

''నెక్స్ట్ బస్ ఆపి అందులో నిన్ను ఎక్కించేస్తామన్నారని నువ్వు నిశ్చింతగా కూర్చున్నావు. బాగానే ఉంది. ఒకవేళ ఆ బస్సు ఇక్కడ ఆగకపోతే? ఈ డ్రైవరూ, కండక్టరూ కావాలనే ఆ బస్సుని ఆపించకపోతే? ఇది బస్టాపుకూడా కాదు, ఏ బస్సైనా ఇక్కడ ఆగుతుందనుకోవడానికి! ఆ బస్సుకూడా మిస్సయ్యావంటే అంతే—తెల్లారేదాకా ఈ బస్సులోనే కూర్చోవాలి! మరి కాసేపట్లో ట్రాఫిక్కూ ఉండదు. మనుష్యుల అలికిడీ ఉండదు'' అన్నా డాయన.

అప్పుడు తెలిసింది నేను ఎంత పొరపాటు చేశానో!

అవును— నిజంగానే ఆ వచ్చే బస్సుని వీళ్ళు ఆపకపోతే?

తెల్లారేదాకా వీళ్ళిద్దరితో పాటు ఈ బస్సులో గడపాలి!

ఒళ్ళు జలదరించింది.

''పోనీ, ఆ బస్సు వచ్చేదాకా నీతోపాటు కూర్చోమంటే కూర్చుంటా . కాని పెద్దవాణ్ణి— అర్ధరాత్రి... మళ్ళీ ఒంటరిగా వూర్లోకి వెళ్ళడం నాకు కష్టమై పోతుంది.''

ఏం జవాబు చెప్పాలో తెలియక మౌనంగానే కూర్చున్నాను.

''పోనీ, ఒక పని చేస్తావా? ఈ వూర్లో నాకు తెలిసిన వాళ్ళు చాలామంది ఉన్నారు. ఎవరింట్లోనైనా తెల్లారేదాకా గడిపి తెల్లారగట్లే బస్సులో విజయవాడ వెళ్ళిపోవచ్చు.''

''కాని తెల్లవారగట్ల వెళ్ళడానికి ఏమైనా బస్సు

లున్నారండీ?'' అన్నాను సందేహిస్తూ.

''ఎందుకు లేవు? ఇక్కడినుంచే బయలుదేరే బస్సొకటుంది. ఒక ట్రెయిన్ కూడా ఉంది. నీకెందుకు— నువ్వు నిశ్చింతగా ఉండు. పొద్దున్న ఇంటర్వ్యూ లోపున విజయవాడ చేర్పించే పూచీ నాది!'' అన్నా డాయన ధైర్యం చెబుతున్నట్లు.

ఒకటి రెండు పరిచయాలతో నా గురించి అంత బాధ్యత తీసుకుంటున్న ఆయన్ని చూస్తుంటే మనస్సంతా కృతజ్ఞతతో నిండిపోయింది.

''సరే, పదండి'' అన్నాను.

నేను తెచ్చుకున్న ఒకే ఒక ఎయిర్‌బాగ్ భుజానికి తగిలించుకుని ఆయన వెంట నడిచాను.

అంతకుముందుదాకా అల్లకల్లోలమైన సముద్రంలా ఉన్న మనస్సు ఇప్పుడు ప్రశాంత సరోవరంలా ఉంది!

ఇద్దరం మట్టిబాట పట్టాం.

''మీరు సంస్కృత శ్లోకాలు బాగా చదువుతారండీ'' అన్నాను ఏదో ఒకటి మాట్లాడాలన్నట్లు.

''అవునమ్మా. సంస్కృతంలో టీచర్ని. ఆ పాటైనా చదవలేకపోతే ఎలా!''

''మా మామయ్య మీకు బాగా స్నేహితుడండీ?'' అడిగాను ఆయన పక్కగా నడుస్తూ.

''లేదమ్మా—భజనల్లో చూడ్డమే! మొన్న అక్కడ మా చుట్టా లింటి కెళితే చెప్పారు ఇలా ఫలానా వాళ్ళింట్లో భజనలు జరుగుతూ ఉంటాయి, చాలా బాగా చేస్తారని. వెంటనే ఆ రోజు వచ్చేశాను.''

''అయితే మామయ్య లాగే మీక్కూడా ఇటువంటివంటే బాగా ఇంటరెస్టన్న మాట.''

''అవునమ్మా. ఇటువంటి వంటే ఆసక్తే. చేసుకోక తప్పలేదు కూడాను! పదేళ్ళ క్రితం నా భార్య పోయింది. అప్పటినుంచి నా కిదే ప్రపంచం.''

నా కేమనాలో తోచక మౌనంగా ఉండిపోయాను.

మట్టిబాట ఆఖరయింది. పూర్లో ప్రవేశించాం.

అప్పుడే పట్నం రూపు సంతరించుకుంటున్న చిన్న పూరు!

అక్కడక్కడ స్ట్రీట్ లైట్లు వెలుగుతున్నాయి. బజార్లో నడుస్తుంటే దుకాణాల షట్టర్లు ఒక్కొక్కటే మూసేస్తున్నారు.

ఆయన వెంట నిశ్చింతగా నడుస్తున్నాను. ఆ చిన్న పూర్లోంచి ఆవు వెంట వెళుతున్న దూడలా

## 4

ఎక్కడినుంచో ఒక కీచురాయి 'గీ' మని అరిచింది. ఆలోచనల్లోంచి తేరుకుని ఉలిక్కి పడ్డాను.


అతను పెద్ద పెద్ద అడుగులు వేస్తూ నా కంటే బాగా ముందుగా వెళ్ళిపోతున్నాడు.

అమ్మేమో వెయ్యలేక వెయ్య క అడుగులు వేస్తూ నా కంటే బాగా వెనకబడిపోయింది

ముందు నడుస్తున్న అతని రెండు చేతుల్లోనూ ఉన్న రెండు పెట్టెల్లోనూ నా సర్వస్వం ఉన్నాయి.

వెనకొస్తున్న అమ్మలోనూ నా సర్వస్వం ఉంది.

అమ్మ కోసం ఆగిపోతే నిమిషంలో అతను కనుమరుగై పోతాడు! అతను పట్టాల మీంచి దిగిపోయి ఏ పక్కదారో పట్టేసి వెళ్ళిపోతే రాత్రంతా




వెతికినా అతని జాడ తెలుసుకోలేను:

''ఏయ్, అబ్బాయ్, కాస్త ఆగు.'' గట్టిగా చప్పట్లు చరిచి అరిచి పిలిచాను. అతను ఆగిపోయాడు.

అమ్మ నన్ను చేరుకునేదాకా ఆగి, ఇద్దరం కలిసి అతన్ని కలుసుకున్నాం.

''కాస్త మెల్లగా నడు, నాయనా! ముసలిదాన్ని... అంత వేగంగా నడవలేను'' అంది అమ్మ రొప్పుతూ.

''అయ్యయ్యో, మర్చిపోనానండి. నా అలవాటు పొప్పున గబగబా అడుగు లేసేశా'' అన్నా డతను.

''ఏదో, నాయనా. ఈ రాత్రి పూట మాకు దేముళ్ళా దొరికావు. మమ్మల్నొదిలేసి ముందర వెళ్ళిపోకు. ఇవతల మాకు ఏమయిపోయినా నీకుతెలియదు.''

'పిచ్చి అమ్మా! దేముళ్ళా వచ్చాడో, దయ్యంలా వచ్చాడో నీ. కేం తెలుసు! అయినా కాస్సేపట్లోనే తెలుస్తుందిగా!' మనసులోనే అనుకున్నాను.

ముగ్గురం కలిసి నడుస్తున్నాం.

''డోర్నకల్లా బాబూ నీది?'' అమ్మ అతనితో మాటలు కలిపింది.

''కాదండి. ఇల్లెందు అని డోర్నకల్నుంచి మళ్ళా ట్రెయినులో పోవాల. అక్కడ బొగ్గుగన్ల పని చేస్తున్న.''

''అలాగా, నాయనా? అయితే రోజూ గనిలోకి దిగుతుంటావా?'' అమ్మ ఆశ్చర్యంగా అడిగింది.

''బొగ్గు గని లోపలే కదండీ పని! రోజూ దిగాల. తవ్విన బొగ్గుని టబ్బుల్లోకి నింపాల'' అన్నా డతను.

''ఎంత జీతం మిస్తారేమిటి, నాయనా?''

''టబ్బుల్ని నింపడాన్ని బట్టి ఉంటుందండి. ఒక్కోరోజు పదిహేను రూపాయ లొస్తయి. ఒక్కోరోజు ఇరవై అయిదుకూడా వస్తయ్.''

''అయ్య బాబోయ్, అంత డబ్బొస్తుందా? మా అమ్మాయి ఉద్యోగం కంటే నీ ఉద్యోగమే బాగుంది, బాబూ'' అంది అమ్మ ఆశ్చర్యంగా.

అతన్ని మంచి చేసుకోవడానికీ, అతన్ని మాతో బాటే నడిచేటట్టు చేయడానికీ అమ్మ మాటల్ని వాడి గిస్తుందని తెలుసు! నిర్లిప్తంగా వాళ్ళిద్దరి మాటలూ వింటున్నాను.

''అమ్మగారి దే ఉద్యోగమండీ?'' అడిగా డతను.

''డోర్నకల్లోనే ఉద్యోగం దొరికింది, నాయనా. స్టైనో...నా కడుపున కాసిన ఒకే ఒక్క కాయ. దీనికి రెండేళ్ళప్పుడే వీళ్ళ నాన్న పోయాడు.''

''ప్చ్! సానా కష్టపడి పెంచుంటారు'' అన్నా డతను సానుభూతిగా.

''కష్టాలా? ఇన్నీ అన్నీనా, బాబూ. ఏదో మా తమ్ముడి సాయంతో ఇంతవరకు నెట్టు కొచ్చా. కాస్త పొలం ఉందిలే.''

ఎవడో దారిన పోయే అనామకుడికి అమ్మ ఇవన్నీ ఎందుకు చెబుతూందో అర్థం కాలేదు. కాస్త చికాక్కూడా వేసింది.

మళ్ళా నేనే సరిపెట్టుకున్నాను. ఒంటరితనంలో, చీకట్లో ఏదో చిన్న ఆసరా దొరికినా చాలని అమ్మ ఆరాట పడుతూంది.

ఉద్యోగం చేస్తున్నా, అమ్మని పోషిస్తున్నా నేను అమ్మకంటే చిన్నదాన్నే, అమ్మ దృష్టిలో పాపాయినే పైగా ఆడపిల్లని!

''ఒక్కరూ తెలవని పూర్లో ఎట్లా ఉంటరండీ?'' అడిగా డతను.

''తప్పదు కదా, నాయనా. ఆ పూర్లో మా తమ్ముడి స్నేహితు డొకాయన ఉన్నాడ్లే. కొన్నాళ్ళ పాటు ఇల్లూ అదీ దొరికే దాకా ఆయనే చూసుకుంటాడు.''


''అవున్లెండి. లేకపోతే కొత్త పూర్లో ఆడవాళ్ళిద్దరూ ఉండడం కష్టమే.''


''ఏం చెయ్యను, నాయనా? పెళ్ళి చేసి అత్తారింటికి పంపించవలసింది పోయి, ఉద్యోగం చేయించి నా దగ్గరే ఉంచుకుంటున్నాను.''

ఈ మాట ఇదివరలోనేకాక చాలామందితో చాలా సార్లు అంటూనే ఉంటుంది.

''మీరు మాత్రం ఏం చేస్తార్లెండి!''

''మా తమ్ముడు రెండు మూడు సంబంధాలు చూశాడు. ఉద్యోగం చేసి కొంత డబ్బు వెనకేస్తే కాని పెళ్ళి చేసుకోనని మొండి కేసింది! అప్పుడైనా నన్నుకూడా వాళ్ళతోపాటు ఉంచుకునే వాడినే చేసుకుంటుందట.''




"చాలా మంచి మనసు అమ్మాయిగారిది—ఈ రోజుల్లో మొగపిల్లలే తలిదండ్రుల్ని వొదిలి పెట్టేస్తున్నారు" అన్నాడతను మెచ్చికోలుగా.

నాకు నవ్వొచ్చింది. బలి చెయ్యబోయే ముందు మేకని బాగా అలంకరిస్తారు.

వాళ్ళిద్దరి మాటలూ అలా కొనసాగుతూనే ఉన్నాయి. నేనూ పరధ్యాన్నంగా వింటున్నాను.

అతను బొగ్గు గనుల గురించి ఏవేవో చెప్తున్నాడు.

అమ్మ తన కష్టాలూ, బాధలూ కలబోసుకుంటోంది.

అప్పటికి మేము నడక మొదలెట్టి పది నిమిషాలు దాటింది.

ఇంతవరకు అతనెందుకూరుకున్నాడు?

అవకాశంకోసం చూస్తున్నాడా? అవకాశంకోసం ప్రయత్నించే వాళ్ళని చూశాను. మరి ఇతను?

రైలు పట్టాలకి రెండు వైపులా పొలాలే, చీకటి రాసుల్లా ...

ఆ పొలాల మధ్యలో అక్కడక్కడున్న నీటి గుంటల్లోంచి కప్పలు బెకబెక మంటున్నాయి.

, ఉండి ఉండి రైలు పట్టాల పక్కనించి ఏ పురుగో వెళ్తున్న గల గల చప్పుడు! నడుస్తున్న కొద్దీ స్టేషన్ దీపాలు ఇంకా దూరమయి పోతున్నాయేమో నన్న భ్రాంతి!

అతను గట్టిగా మాట్లాడుతున్న మాటలకి రైలు పట్టాలకి పక్కనే అక్కడక్కడ ఉన్న తుమ్మ చెట్ల మీంచి ఏదో పక్షి రెక్కలు టపటప లాడించిన చప్పుడు ...

అతను సరియైన అవకాశంకోసం చూస్తున్నట్లున్నాడు!

అవునంతే!

రైలు పట్టాలకి రెండు వైపులా పొలాలే ఉన్నాయి. అటునించి ఎవరైనా గబుక్కున వచ్చేస్తే ఏం చేస్తున్నా ఇట్టే తెలిసిపోతుంది!

అందుకే దట్టంగా పొదలో ... చెట్లో ఉండే స్థలం గురించి ఎదురుచూస్తున్నాడేమో?

హాయిగా పశువాంఛ తీర్చేసుకుని పెట్టెలు పట్టుకొని అడ్డ దారంట ఊళ్ళోకి పారిపోతాడా?

లేక తన పనయ్యాక మమ్మల్ని అలా వదిలేయకుండా పీక పిసికి చంపేసి రైలు పట్టాల పక్కనే ఉన్న ఏ నీటి మడుగులోనో పడేసి నిశ్చింతగా వెళ్ళిపోతాడా?

"బాగా దాహమేస్తోంది, నాయనా ..." అంది అమ్మ నీరసంగా.

"ఇక్కడికి దగ్గర్లోనే ఒక నీటి మడుగు ఉంది లెండి ... అక్కడ నీళ్ళు ముంచి తెస్తాను. మీ దగ్గర ఏదైనా మరచెంబుందా?" అడిగాడతను.

అయిపోయింది! నే ననుకొన్న క్షణం దగ్గర కొచ్చేసింది.

"ఆ నీటి మడుగేదో త్వరలో వచ్చేస్తే బాగుండునే, తల్లీ... దాహంతో నోరెండి పోతోంది" అంది అమ్మ.

అవును, త్వరగా వచ్చేస్తే బాగుండును.

ఉరి తీసే ముందు ఖైదీ మనస్సులా ఉంది నా మనస్సు.

మరెంత సేపో ఈ బాధ, భయం భరిస్తూ నడవడం కంటే అదేదో త్వరగా అయిపోతే బాగుండును.

మరి కొన్ని అడుగులు నడిచే సరికే కనిపించింది నీటి మడుగు!

పట్టాల క్కాస్త దూరంలో ... నక్షత్రాల కాంతిలో ... తళతళ్ళాడుతున్న నీటితో...

కప్పల బెకబెకలు విపరీతంగా వినబడుతున్నాయి.

"మరచెం బియ్యండి— నీళ్ళు తెస్తాను."

ఆ కప్పల బెకబెకల మధ్య అతని గొంతు మరింత బొంగురుగా వినిపించింది.

అతని దగ్గర్నుంచి పేము బుట్ట తీసుకొని అందులోంచి మరచెంబు తీసి అందించింది అమ్మ.

అది పట్టుకొని అతడు పట్టాల కిందికి దిగాడు. నీళ్ళలో చెంబు ముంచాడు. బుడుంగు బుడుంగుమన్న చప్పుడు విచిత్రంగా వినిపించింది.

మరి కాస్సేపట్లో మా ఇద్దరి శవాలు కూడా నీటిలో మునుగుతూ అలాగే బుడుంగు బుడుంగుమని శబ్దం చేస్తాయి కాబోలు!

అతను చేత్తో మరచెంబుతో గట్టు మీదికి ఎక్కుతున్నాడు.

అతను ఒక్కో అడుగు గట్టు మీదికి వేస్తుంటే యమ భటుడు ఒక్కొక్క అడుగే దగ్గరికి వేస్తున్నట్లు అనిపించింది.

మడుగు చుట్టూ పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగి ఉన్నాయి!

అనువైన చోటు! అవును, అనువైన చోటు!

అతను రైలు పట్టాలు ఎక్కి అమ్మకి మరచెంబు అందించాడు. అమ్మ గటగటా సగం నీళ్ళు తాగేసింది. మిగిలిన సగం నేను తాగేశాను.

"బాగా అలిసిపోయినట్లున్నారు— కాస్సేపు ఈ పట్టాల మీద కూకొని అలుపు తీర్చుకొంటారా?" అడిగాడతను:

"అవున్నాయనా—నేనే ఆ మాట అందా మనుకొంటున్నాను... పెద్దదాన్ని—ఎక్కువ దూరం నడవలేక పోతున్నాను" అంది అమ్మ అప్పుడే పట్టాల మీద చతికిలపడిపోతూ.

నేను కూడా నీరసంగా అమ్మపక్కనే కూలబడ్డాను.

"నే నిప్పుడే రెండు మినిట్లొ వొస్తాను. ఇద్దరూ ఇక్కడ కూర్చోగలరా?" అన్నాడతను.

"అలాగే, నాయనా. వెళ్ళు" అంది అమ్మ.

అతను మళ్ళా గట్టు దిగి రైలుపట్టాల కిందుగా ఉన్న పొదల చాటుకి మాయమయ్యాడు.

ఆఖరి నిమిషం. దేముణ్ణి తల్చుకోవాలి అనుకొన్నాను.

ఎందుకో కాని ఆ సమయంలో దేముడు కాక ఆయనే ... ఆ ముసలాయనే ... గుర్తొస్తున్నాడు.

ఇందాక తెగిన ఆలోచనల గొలుసు మళ్ళా అతుక్కొంది.

(సశేషం)

అవధానుల విజయలక్ష్మి

# మనిషిలో మనిషి

(క్రిందటి సంచిక తరువాయి)

**ఇద్దరం** మౌనంగా ఆ చిన్న వాడవు వీధుల్లోంచి నడుస్తున్నాం.

"ఏమ్మా—ఏమైనా కొన్ని తింటావా?" అన్నాడాయన ఆప్యాయంగా.



"వద్దండీ" అన్నాను మొహమాటంగా.

"వద్దంటే ఎలాగమ్మా? మళ్ళీ రేప్పొద్దున్న దాకా ఖాళీ కడుపుతో ఉంటావా? మళ్ళీ పొద్దున్న ఇంటర్వ్యూకి కూడా పోవాలి అన్నావు. పద, ఇక్కడో మంచి హోటలుంది. భోజనం చేద్దువు కాని. నేను ఇందాకనే తినేశాను" అన్నాడాయన.

అనుసరించక తప్పింది కాదు.

వద్దంటున్నా వినక బిల్లు ఆయనే చెల్లించేశాడు.

ఒక వైపు మొహమాటం, ఒక వైపు విశ్రాంతి—ఉక్కిరి బిక్కిరి అయిపోయాను.

ఆ సమయానికి బస్సులో ఒక్కరైనా బిక్కు బిక్కుమంటూ కూర్చోవలసిందన్న విషయం గుర్తు రాగానే ఒళ్ళు ఝల్లుమంది.

హోటల్లోంచి బయటకు వస్తుండగా ఆయ అన్నాడు:

"ఇక్కడ నాకు తెలిసిన వాళ్ళు ఇద్దరు ముగ్గు రున్నారు. తెల్లారేదాకా ఎవరింట్లోనైనా విశ్రాంతి తీసుకుందువు కాని."

"ఏమిటో మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్న ట్లున్నాను."

"ఛ. ఛ... ఇబ్బందేమిటమ్మా ఇది నా ధర్మం" అన్నాడాయన.

మేం హోటల్లోంచి బయట పడేసరికి పది అయింది.

మెయిన్ రోడ్డు విడిచి పక్క సందు పట్టా డాయన. పది నిమిషాలు నడిచాక, రెండు మూడు మలుపులు తిరిగాక ఒక ఇంటి ముందు ఆగాడు.

ఇంటి తలుపు టకటకా కొడుతూ—

"అమ్మాయ్, సుజాతా! కాస్త తలుపు తియ్యమ్మా" అన్నాడు.

నలభై ఏళ్ళ స్త్రీ తలుపు తీసింది.

"ఓహో! మీరా?" అంది ఆయన వైపు అదోలా చూస్తూ.

"చూడు, తల్లీ. ఈ అమ్మాయి మా చుట్టా లమ్మాయి. రేప్పొద్దున్న ఇంటర్వ్యూ కని బయలు దేరింది. పాపం! ఈ వూరు దగ్గర కొచ్చేసరికి బస్సు చెడిపోయిందట. ఇంత రాత్రి ఆ బస్సులో ఒక్కర్తీ ఏం కూర్చుంటుందిలే అని నేనే తీసుకొచ్చేశాను. ఇవాళ రాత్రి మీ ఇంట్లో పడుకుని రేప్పొద్దున్నే వెళ్ళిపోతుంది" అన్నాడాయన ఎంతో మర్యాదగా.

ఆవిడ కనీసం గుమ్మానికి అడ్డం తొలగి "లోపలికి రండి" అనైనా అనలేదు.

ఆవిడ కాస్సేపు తటపటాయించి "ఇవాళ మా ఇంటికి చాలామంది చుట్టాలొచ్చారండీ. ఇంట్లో అస్సలు జాగా లేదు" అంది.

మాటల్లో కాస్త మర్యాద లోపించినట్లు అనిపిం చింది.

'ఛీ. ఛీ; ఏం మనుష్యులు' అనుకున్నాను.

"సరేలే, తల్లీ! రామారావింటికి తీసుకెళతాను" అన్నాడాయన వెనక్కు తిరుగుతూ.

మేం వెనక్కు తిరగ్గానే ఆవిడ గబుక్కున తలుపేసేసుకుంది.

మనస్సులో ఎక్కడో కలుక్కుమంది.

అంతవరకు విశ్రాంతిగా ఉన్న మనస్సులో ఎక్కడో చిన్న ముల్లు గుచ్చుకున్నట్లు అనిపించింది.

ఎంత చుట్టాలొస్తే మాత్రం... ఎంత జాగా లేకపోతే మాత్రం...

ఆవిడలా నిష్కర్షగా చెప్పిన తీరూ, ధడాలున తలుపు వేసేసుకున్న తీరూ మనస్సుని కలవర పరిచాయి.


ఆయన నా వైపు తిరిగాడు.

"వీళ్ళు మాకు కాస్త దూరపు బంధువులమ్మా. మనుష్యులకి సాయం చెయ్యాలంటే ఏడుస్తారు. వూరికి దగ్గరగా ఉంది కదా నిన్ను ఎక్కువ సేపు నడిపించడ మెందుకని ఇక్కడికి తీసుకొచ్చాను. పద—మరి కాస్త దూరం నడిస్తే రామారావని నా స్నేహితుడి కొడుకు ఒకడి ఇల్లుంది. అక్కడికి తీసు కెళతాను."

ఇద్దరం అక్కడినుంచి నడిచాం.

ఇందాకటి ధైర్యం, ఉత్సాహం కాస్త తగ్గి పోయాయి.

ఎక్కడో చిన్న అనుమానం పెరుగుతూంది.




కాని అది ఉత్త అనుమాన మేనేమో?

మరో పది నిమిషాలు నడిచాక మరో ఇంటి ముందు ఆగాం.

కటకటాల వరండాలోంచి ఇంట్లోపలి లైట్లు కనబడుతున్నాయి.

మనుష్యుల మాటలుకూడా వినబడుతున్నాయి.

కాలింగ్ బెల్ నొక్కాడాయన.

ముప్పై ఏళ్ళ యువకుడు తలుపు తీశాడు.

"బాగున్నావా, నాయనా?" అడిగాడాయన.

"ఓహో! మీరా? రండి, రండి" అన్నాడా యువకుడు.

ఇద్దరం లోపలికి నడిచాం. ఒకే ఒక గది ఉన్న చిన్న వాటా అది. కటకటాల వరండాలో నాలుగు పేము కుర్చీ లున్నాయి. వరండా కానుకుని ఉన్నది బెడ్ రూమ్ కాబోలు. ఒకే ఒక పెద్ద మంచం మీద తెల్లటి దుప్పటి పరిచి ఉంది.

గదికి మధ్యగా పార్టిషన్ ఉంది. అవతలి వైపు వంటగది కాబోలు! అతి చిన్న ఇల్లైనా ముచ్చటగా ఉంది.

"ఈ అమ్మాయి గుంటూర్లో సూరిబాబుగారని ఉన్నారు. ఆయన మేనగోడలు" అంటూ నన్ను పరిచయం చేసి జరిగిందంతా క్లుప్తంగా చెప్పేశాడు.

"అమ్మాయి కావలసి కొచ్చిందా, నాయనా?"

"మొన్ననే వచ్చిందండీ" అని మొహమాటంగా నవ్వి—

"లక్ష్మీ! రెండు గ్లాసులతో నీళ్ళు తీసుకురా" అని కేకేశాడు.

పార్టిషన్ అవతలి నుంచి రెండు గ్లాసుల నీళ్ళు తీసుకొచ్చిందో యువతి.

"ఈయన మా నాన్నగారి స్నేహితుడు. ఈవిడ ఆయన స్నేహితుడి మేనగోడలు" అంటూ పరిచయం చేశాడు.

ఆ అమ్మాయి మెడలో పసుపుతాడు పచ్చగా మెరుస్తూంది.

"నమస్కారమండీ" అంది మృదువుగా.

"చూడు నాయనా. ఈ అమ్మాయి తెల్లారేదాకా ఇక్కడే పడుకుంటుంది. తెల్లారాక బస్సులో వెళ్ళి పోతుంది" అన్నాడాయన.

ఆ యువకుడు కాస్సేపు ఆలోచించి—

"అలాగే లెండి. లక్ష్మీ!, ఆవిడ ఈ గదిలో పడుక్కుంటారు. మనిద్దరం ఆ వరండాలో పడు కుందాం" అన్నాడు మర్యాదగా.

ఆయన దగ్గరగా నవ్వాడు.

"భలేవాడివోయ్. అమ్మాయి కావలసి కొచ్చి నాలుగు రోజులుకూడా కాలేదంటున్నావ్. మరేం ఫరవాలేదులే. మా ఇద్దరికీ రెండు చాపలు పడేయ్. నేనూ ఈ అమ్మాయీ వరండాలో అలా పడుం టాలుస్తాం" అన్నాడు.

నాకా సంభాషణ చెప్పలేనంత ఇబ్బందిగా అనిపించ సాగింది.

'ఛీఛీ ఇరుకున పడిపోయాను' నా స్థితికి నాకే అసహ్యం వేసింది.

ఆ యువతికూడా ఆ సంభాషణకి మొహమాట పడిపోయినట్లు వంటింట్లోకి వెళ్ళిపోయింది.

"చూడమ్మాయ్. ఇప్పుడు వంటకి ఏర్పాట్లేం

7—3—84

చెయ్యకు. ఇద్దరం భోజనం చేసేశాం. మా ఇద్దరికీ రెండు చాపలూ, ఉంటే రెండు దిండ్లూ ఇలా పడేయ్ చాలు" అన్నాడాయన.

మొట్టమొదటిసారిగా నాకనిపించింది హాయిగా బస్సులో కూర్చోకుండా ఈయన వెంట వచ్చేసి నేను తప్పు చేశానేమోనని!

ఆ తరవాత మళ్ళీ నా అనుమానానికి నన్ను నేనే తిట్టుకున్నాను.

కొత్తగా పెళ్ళైన వాళ్ళింట్లో ఆశ్రయం కోరినప్పుడు ఆయన అలాకాక మరెలా మాట్లాడగలడు!

ఆ యువతి రెండు చాపలూ, రెండు దిండ్లూ తెచ్చింది.

"ఏమిటో మీకు సరియైన ఏర్పాట్లు చెయ్యలేకపోతున్నాను" అన్నాడా యువకుడు మొహమాటంగా.

"ఫరవాలేదు లేవోయ్. నువ్వు మాత్రం అంతకంటే ఏం చెయ్యగలవు?" అన్నాడాయన.

నాకు ఆ సంభాషణ ఎంత త్వరగా ముగిసిపోతే అంత బావుండునని ఉంది.

కుర్చీలు పక్కకి జరిపి చాపలు పరిచాను.

"అమ్మాయి నడిచి నడిచి చాలా అలిసిపోయింది. నాకూ అలాగే ఉంది. ఇంక పడుక్కుంటాం. మీరూ పడుక్కోండి. గుడ్‌నైట్" అన్నాడాయన.

ఆ యువకుడు గదిలోకి నడిచాడు.

తలుపు వెయ్యాలా, వద్దా అన్నట్లు అక్కడే తటపటాయిస్తూ నిలుచున్నాడు.

"ఏమండీ! బస్సు దగ్గిరికి వెళ్ళిపోదాం. మరో బస్సు వచ్చేదాకా అందులోనే గడిపేస్తాము" అనాలని బలంగా అనిపించిందో క్షణం.

కాని కింద చాపలుకూడా పరిచేశాక ఆ మాట అనలేను!

"తలుపేసుకోవోయ్ ఫరవాలేదు" అన్నాడాయన.

ఆ యువకుడొక్క క్షణం నా వైపు ఏదో అపరాధం చేస్తున్నట్లు చూసి తలుపేశాడు.

మరో అయిదు నిమిషాల్లోనే తలుపు సందుల్లోంచి పడుతున్న వెలుగు ఆరిపోయింది.

ఆ వెలుగు ఆరిపోయాక నన్ను చెప్పలేనంత ఒంటరితనం ఆవరించినట్లు అనిపించింది.

అసలు నే నెప్పుడూ ఒంటరిదాన్నే!

చిన్నప్పటినుంచి తోబుట్టువులేక ఒంటరిగానే పెరిగాను.

పదహారేళ్ళకే పెళ్ళి కుదిర్చేసి పెళ్ళి చేసేదామని అమ్మా, మామయ్యా చూస్తుంటే ఒంటరిగానే పోరాడి చదువు కొనసాగించాను.

ఎవ్వరి సహాయం లేకుండా ఒంటరిగానే స్కాలర్‌షిప్‌ల సహాయంతో చదివాను.

ఒంటరిగానే ఉద్యోగ ప్రయత్నాలు చేశాను.

ఒంటరిగానే రెండు మూడు ఇంటర్వ్యూలకెళ్ళాను.

ఒంటరిగానే అమ్మని పోషించాలన్న ధైర్యంతో నిలబడ్డాను. కాని, ఇప్పుడీ ఒంటరితనంలో ఆత్మవిశ్వాసం లేదు!

తెలివి తక్కువగా ప్రవర్తించి కోరి తెచ్చుకున్న ఒంటరితన మిది!




దారి తెలియని అడవిలో తప్పిపోయినట్లున్న నిస్సహాయత.

తెలివి తక్కువ పని చేశానేమోనని నా మీద నాకే కోపం.

అంత పెద్ద మనిషిని గురించి తప్పుగా ఆలోచిస్తున్నానేమో నన్న గిల్టీనెస్.

మనసంతా ఉక్కిరి బిక్కిరిగా ఉంది.

నిద్ర పట్టడం లేదు. పక్కనున్న ముసలాయన నిద్ర పోతున్నట్లు సన్నగా గురక వినిపిస్తోంది.

ఎయిర్‌బాగ్‌లోంచి దుప్పటి తీసి చెవులదాక కప్పుకున్నాను.

నిద్ర పోవడానికి ప్రయత్నించాను.

చిక్కు పడినట్లున్న ఆలోచనల మధ్య ఎప్పుడు నిద్ర పట్టిందో నాకే తెలియదు.

ఒక గంటసేపు నిద్ర పోయి ఉంటానేమో. హఠాత్తుగా మెలకువ వచ్చింది!

ఆయన వీధి కటకటాల తలుపు తీసి బయట కెళుతున్నాడు. బహుశః నేచురల్ కాల్ గురించి కాబోలు.

ఆ గడియ తీస్తున్న శబ్దానికే నాకు మెలకువ వచ్చేసింది!

మళ్ళీ కాసేపట్లోనే ఆయన లోపలి కొచ్చి తలుపు గడియ వేసేశాడు.

నాకు మెలకువ వచ్చినట్లు ఆయనకి తెలియకూడదు.

కప్పుకున్న దుప్పటిని అలాగే ఉంచుకుని చీకట్లోకి చూస్తున్నాను. నా మొహం చీకట్లో ఆయనకి కనిపించదు. కాని వీధి లైటు వెలుగు వచ్చి నిలుచున్న ఆయన మొహంమీద పడుతోంది.

ఆ కళ్ళు దీక్షగా చూస్తున్నాయి నా వైపు. నా కాళ్ళలో సన్నగా వణుకు మొదలయింది!

ఒకటి. రెండు. మూడు నిమిషాలు.

ఆయ నింకా అలా దీక్షగా చూస్తూనే ఉన్నాడు.

ఏం చెయ్యా లిప్పుడు? లేచి ఏం కావాలండీ? అని అడగాలా? అలాగే నిద్ర పోతున్నట్లు నటించాలా?

రెండోదే మంచిదేమో! కదలకుండా అలా చెవుల దాకా దుప్పటి ఉంచుకునే పడుకున్నాను.

అయిదు నిమిషం పాటు అలా చూసి, చూసి అప్పుడొంగా డతను.

## 5

నా చాపకీ అతని చాపకీ మధ్య మూడడుగుల దూరముంది.

నెమ్మదిగా వంగి నా చాపకీ అతని చాపకీ ఉన్న మధ్యదూరాన్ని సగం తగ్గించాడు.

ఆ తరవాత చాపమీద పడుకున్నాడు.

ఏం జరుగుతుందిప్పుడు? ఊపిరి బిగపట్టి ఎదురు చూస్తున్నాను. అతను అతి మెల్లగా తన కాలుని నా కాలుకి దగ్గరగా జరిపాడు. కప్పుకున్న దుప్పటి మీదుగా తగిలీ తగలనట్లు అతని కాలు తగులుతూంది.

మరో రెండు నిమిషాలు గడిచాయి. అతను తన కాలుని మరింత దగ్గరగా జరిపాడు. ఆ తరవాత మెల్లగా అతి మెల్లగా కాలుతోనే దుప్పటిని కాస్త తొలగించాడు.

నా పాదం మీద తన పాదం వేసేశాడు.

నా ఒళ్ళు జలదరించింది! తెల్లగా ఉన్న పాల బల్లి టప్ మని చేతిమీద పడితే కలిగే జలదరింపు!

ఒళ్ళంతా ఆక్రమించుకుంటున్న అసహ్యాన్ని అణచుకుంటూ అలాగే నిద్ర నటించసాగాను, అతను కాలు తీసే క్షణం కోసం ఎదురు చూస్తూ.

కాని అతను నా కాలు తియ్యలేదు. పైగా అతని పాదంతో నా పాదం మీద నెమ్మదిగా రాస్తున్నాడు.

పాదం మీద ఏదో గొంగళి పురుగు పాకుతున్నట్లు అనిపించింది. ముసలాయన ప్లానంతా ఆ క్షణంలో అర్థమయిపోయింది ఎంత చీప్ ట్రిక్!

నేను నిద్ర పోతున్నా ననుకుంటున్నాడు. ఒకవేళ నేను గబుక్కుని లేచినా నిద్రలో పొరపాటున కాలు పడినట్లు నటిస్తాడు!

ఆ క్షణంలో అంతకంటే ఇంకేం చెయ్యలేని తను స్పర్శసుఖంతో తృప్తి పొందుతున్నాడు!

ఇప్పుడు నేను చెయ్యగలిగినవి రెండే.

నిద్ర పట్టడం ఎలాగూ అసాధ్యం.

రాత్రల్లా నిద్ర పట్టినట్టు ఈ నరకాన్ని అనుభవించాలి.

లేదా అంటే లేచి కూర్చుని రాత్రల్లా జాగారం చేస్తూ గడపాలి.

రెండింటిని చెయ్యలేను. రాత్రల్లా గొంగళిపురుగు స్పర్శ భరిస్తూ గడపలేను.

పోనీ నిద్రలోంచి లేచి కూర్చుంటే ఆయనా లేచి పోతాడు.

రాత్రంతా ఆయనతో మాట్లాడుతూ గడపాలి.

అలా మాట్లాడుతూ కూర్చుంటే తను చేస్తున్న పని తెలిసికూడా నేను ప్రతిఘటించ లేదు అను కుంటాడేమో?

మరింత ముడుచుకుపోతాను.

ఒంటరిగా ఉన్న ఆడది ఎవరికైనా ఎంత తేలికో అర్థమైంది.

ఆలోచనలతో బుర్ర వేడెక్కుతోంది.

అతని పాదం నా పాదం మీద మరింత నాట్యం చేస్తోంది. గబుక్కున లేచి, తలుపు కొట్టేసి లోప లున్న వారిద్దరికీ ఈ విషయం చెప్పేస్తేనో అనిపించిందో క్షణం.

హాయిగా పడుకున్న వాళ్ళిద్దర్నీ లేపడం ఎంత వరకు భావ్యం? ఒకవేళ లేపినా ముసలాయని ఎదురుగా వాళ్ళకి జరిగింది ఎలా చెప్పగలను?

ఒకవేళ చెప్పినా వాళ్ళు ఎంతవరకు నమ్ముతారు? ఇదంతా అబద్ధమనీ, నేనే చీప్‌గా ఆలోచిస్తున్నాననీ ఆయన దబాయించేస్తే?

అసలు వాళ్ళూ వాళ్ళూ స్నేహితులు. నేనే పరాయిదాన్ని.

పది నిమిషాలు గడిచిపోయాయి. ఒక నిర్ణయాని కొచ్చేశాను.

అప్పుడే తెలివి వచ్చినట్లుగా కొంచెం కదిలాను. అతను ఉలిక్కి పడి లేచి కాలు తీసేశాడు. నేను లేచి కూర్చున్నాను.

"ఎందుకమ్మా లేచావ్?" అన్నా డతను పడుకుని ఉండే.

అతను 'అమ్మా' అని అలా సంబోధిస్తుంటే ఒంటిమీద తేళ్ళూ జెర్రులూ పాకుతున్నట్లు అనిపించింది.

నేను లేచి గది తలుపు వైపు నడిచాను.

"బాత్‌రూం కెళ్ళాలండి" అంటూ.

"బాత్‌రూం కెళ్ళాలంటే వాళ్ళ తలుపు కొట్టక్కర్లేదమ్మా. పెరట్లో ఉంది ఇలా చుట్టూ తిరిగి వెళ్ళొచ్చు"

అతని మాటలు పూర్తి కాకుండానే నేను గబగబా గది తలుపు మీద బాదాను.

అర నిమిషం తరవాత తలుపు తెరుచుకుంది. నిద్ర కళ్ళతో ఆ యువతి నా వైపు అదోలా చూస్తూ తలుపుకి అడ్డంగా నిలుచుంది.

"బాత్‌రూం కెళ్ళాలండి అర్జంటుగా" అని గట్టిగా అంటూనే ఆ అమ్మాయిని తోసుకుని నేను గదిలోకి నడిచాను.

అక్కడ ఆగకుండానే గబగబా వంట ఇంటి వైపు నడిచాను.

ఆ యువతి చిత్రపోయినట్లు చూస్తూ నా వెనకే వచ్చింది. నేను వంటింట్లోంచి పెరట్లోకున్న తలుపు గడియ పెద్ద శబ్దం చేసి తీస్తూ

"ఇదే కదండీ దారి?" అన్నాను.

ఆమె చెప్పే సమాధానం కోసం ఎదురు చూడకుండానే పెరట్లోకి నడిచాను.

ఆమె నా వెనకే వచ్చి, పెరట్లో ఉన్న బాత్‌రూంలో లైటు వేసింది.

నేను వంటింట్లో కున్న తలుపు వేసేసి ఆమె దగ్గరికి నడిచి గబుక్కున ఆమె రెండు చేతులూ పట్టుకున్నాను.

"నన్ను రక్షించరూ! ప్లీజ్!" అన్నాను గిలగిలా అతి చిన్న స్వరంతో. నే నేమంటున్నానో అర్థం కానట్లు నా వైపు చూసింది. మళ్ళీ నేనే అన్నాను.

"మీకు ఇబ్బంది కలిగిస్తున్నాను. నాకు తెలుసు. నన్ను క్షమించండి. కాని నేను మరో క్షణంకూడా ఆ వరండాలో ఆ ముసలాయన పక్కన పడుకోలేను."

అప్పటికి నే నంటున్న దేమిటో ఆమెకి అర్థమైనట్లుంది. నా చేతుల్లోంచి తన చేతులు విడిపించుకుని నా భుజం మీద చెయ్యి వేసి—

"ఏమయింది?" అనడిగింది మెత్తని స్వరాన.


ఎల్. కె. ఎస్. బంగారం
చేతిలో రొక్కమే!

గ్యారంటీ గల
22 కారట్ల బంగారు ఆభరణాల కొరకు

LKS

L.K.S Jewellers
Gold Jewels & Diamonds
138, N S C BOSE ROAD MADRAS-1

సందర్శించండి :
ఎల్. కె. ఎస్. జ్యూవలర్స్,
138 ఎన్. ఎస్. సి. బోస్ రోడ్డు,
మద్రాసు-600 001




అంతవరకు నన్ను ఆవరించుకుని ఉన్న ఒంటరితనం ఆ క్షణంలో తొలగిపోయింది.

ఇద్దరం సమ వయస్కులమే అయినా, ఆమె భుజం మీద తల వాల్చి వెక్కి వెక్కి ఏడవాలనిపించింది. గిర్రున కళ్ళలో తిరిగిన నీళ్ళని తుడుచుకుంటూ అన్నాను.

"మీరు క్షమించాలి! నేనే స్మృతిలో మిమ్మల్ని ఈ గోతికి కోరి ఉంటానో ఆలోచించాను. ఆ ముసలాయన మా వారి తండ్రికి స్నేహితుడు. అందుకే మా వారితో ఇప్పుడేం చెప్పకండి. తెల్లారేదాకా మేము వంటింట్లోనే ఎక్కడో పడుకుపోతాము."

ఆమె నా వైపు జాలిగా చూసింది.

"పదండి ముందు మా వారి దగ్గర కెళ్ళి అన్ని విషయాలూ మాట్లాడుకుందాం" అంది పెరటి తలుపు వైపు నడుస్తూ.

నేను గబుక్కున ఆమె చెయ్యి పట్టుకుని ఆపేశాను.

"ఆయన దాకా ఈ విషయం వెళ్ళనీయకండి ప్లీజ్. ఈ సమస్య మనిద్దరమే పరిష్కరించుకుందాం" అన్నాను ప్రాధేయ పూర్వకంగా.

ఆవిడ నవ్వింది.

"ఆ ముసలాయన ఏదో మా వారికి బాగా దగ్గర చుట్టమో, స్నేహితుడో అనుకుంటున్నారా? చుట్టమూ కాదు, గుడ్డూ కాదు. ఏదో కొద్ది పరిచయం. అంతే. రాత్రి చాలాసేపు ఆయన గురించే మాట్లాడుకున్నాం. ఆయన గురించి చాలా పెద్ద కథ ఉన్నాయట లెండి. మీ రిక్కడే ఉండండి. నేను మా వారిని తీసుకొస్తాను. ఆ గదిలో మాట్లాడుకుంటే ముసలాయనకి వినిపిస్తుంది" అంటూ ఆమె లోపలికి నడిచింది.

నేను పెరట్లో ఉన్న నూతి గట్టుకి నిస్త్రాణగా చేరబడిపోయాను.

ఈపాటికి బెజవాడలో స్నేహితురాలింట్లో వెచ్చగా పడుకుని ఉండవలసింది! ఇలా ఎవరో తెలియని వారింట్లో పెరట్లో నూతి గట్టు మీద నిలుచున్నాను.

రెండు నిమిషాల తరవాత ఇద్దరూ పెరట్లోకి వచ్చారు.

"ఇప్పుడు చెప్పండి" అన్నాడా యువకుడు నవ్వుతూనే నూతి గట్టుమీద కూర్చుంటూ.

'ఏం చెప్పాలి!' నేను నిస్సహాయంగా ఆమె వైపు చూశాను.

అతను నా బాధను అర్థం చేసుకున్నట్లు మృదువుగా అడిగాడు.

"ఆ ముసలాయన మీ నాన్నగారికో, మామయ్య గారికో బాగా స్నేహితుడు కాదూ?"

"అబ్బే! స్నేహం లేదూ, ఏమీ లేదూ. గుంటూర్లో మా మామయ్య గారింట్లో భజనలు జరుగుతుంటాయి లెండి. అప్పుడప్పుడు వస్తూ ఉంటాడు. ఏదో ముఖపరిచయమే. అసలు మా మామయ్యకి ఇతని పేరు కూడా తెలియదేమో!"

"మరి అతని వెంట అలా వచ్చేశా రేమిటండీ?" సందేహంగా అడిగాడు జరిగిందంతా చెప్పాను.

నేను చెప్పడం పూర్తయ్యేసరికి వాళ్ళిద్దరూ ఒకరి మొహం ఒకరు చూసుకుంటున్నారు భావగర్భితంగా.

ఆ యువకుడు చిన్నగా నిట్టూర్చి అన్నాడు.

"ఈయన గురించి చాలా మంది చాలా రకాలుగా చెప్పుకుంటుంటే విన్నాను. కాని అదంతా అబద్ధమేమో అనుకునే వాణ్ణి. ఇప్పుడు ప్రత్యక్షంగా చూశాక తెలుస్తోంది ఎంత నిజమో!"

"ఏం విన్నారు?" కుతూహలంగా అడిగాను.

"ఈయన అసలు వూరేదో ఎవరికీ తెలియదు. కొందరితో బెజవాడ అని చెబుతాడు. కొందరితో గుంటూరని చెబుతాడు. తరచుగా ఈ వూరు వస్తుంటాడు, పనిమీద వచ్చానంటూ. వచ్చినప్పుడల్లా ఎవరో ఒకమ్మాయిని వెంట బెట్టుకు వస్తుంటాడు. మేనకోడలనో, స్నేహితుడి కూతురనో, ఒక్కోసారి ఒక్కో కారణం చెబుతాడు. పెళ్ళిచూపులకి తీసుకొచ్చాననో, ఉద్యోగం వేయించడానికి తీసుకొచ్చాననో... ఎక్కడెక్కడి బీరకాయ పీచు సంబంధాలో కలిపి ఈ వూళ్ళో చాలామందితో స్నేహం చేశాడు. మొదట్లో అందరూ ఈయన్ని ఒక పెద్దమనిషిగానే చాలా గౌరవించారు. కాని క్రమక్రమంగా అందరికీ తెలిసిపోయింది ఆయన వెంటబెట్టుకొచ్చే అమ్మాయిల గురించి."

మొదటిసారి తలుపు కొట్టగానే ఆవిడ ధడాలున తలుపేసుకోడం గుర్తొచ్చింది.

పడుకోబోయే ముందు తలుపేసుకుంటూ ఆ యువకుడు అదోలా చూసిన చూపు గుర్తొచ్చింది.

ఒక గంట ముందు వాళ్ళ మనస్సులో నా స్థానం వూహించుకునే సరికి సిగ్గుతో మనస్సు చితికి పోయింది.

నేను తలొంచేసుకున్నాను. నా మనస్సులో భావం అర్థం చేసుకున్నట్లే అతను అన్నాడు.

"మీ రేం ఫీలవకండి. నన్ను మీ బ్రదరను కోండి. ఇవాళ రాత్రల్లా మీరు మా గదిలో నిశ్చింతగా గడపొచ్చు. బీ చీర్‌ఫుల్!"

నేను కృతజ్ఞతగా వాళ్ళిద్దరి వైపు చూశాను.

ఆ క్షణంలో ఏ మూలనో ఉన్న కొద్దిపాటి జంకు పోయి ఆత్మీయతా భావం కలిగింది.

"ఆ మొదటి ఆవిడ మమ్మల్ని చూడగానే మా మొహం మీదనే తలుపేసేసింది. మరి మీ రలా చెయ్యలేదేం?" అడిగాను కాస్త కుతూహలంతో.

"ఆయన మా ఇంటికి ఇంతకు ముందు రెండు మూడు సార్లొచ్చాడు. మొదటి సారొచ్చి ఎక్కడెక్కడి బంధుత్వాలో కలిపాడు. ఆ తరవాత రెండు సార్లొచ్చాడు. కాని ఎప్పుడూ ఏ అమ్మాయిని వెంట బెట్టుకు రాలేదు. అందుకే వాళ్ళూ వీళ్ళూ చెప్పేవి ఉత్త పుకార్లేమో ననుకున్నాను. ఈసారి మిమ్మల్ని వెంట బెట్టుకు వచ్చాడు. కాని, మీ మొహం చూస్తుంటే ఎందుకో అలా అనిపించ లేదు. అందుకే ఆహ్వానించాను" అన్నాడతను.

"పదండి లోపలి కెళదాం. ఇంత సేపని ఇలా పెరట్లో నించొని మాట్లాడుకుంటాం! ఆయనకి అనుమానం కలక్కుండా ఏదో నచ్చ చెబుదాం."

ముగ్గురం గదిలో కొచ్చాం.

అప్పటికే ముసలాయన వరండాలో లైటు వేసుక్కూర్చొని అసహనంగా చూస్తున్నాడు.

ఆ యువకుడు ముసలాయన దగ్గర కెళ్ళి—

"ఆవిడకి జ్వరం వచ్చినట్లు ఉందండీ. బయట పడుకోవడం అంత మంచిది కాదేమో—లోపల పడుక్కుంటార్లెండి" అన్నాడు.

"మాకు ఇబ్బంది..." ఆ ముసలాయన ఏదో అనబోతున్నాడు.

"అబ్బే, ఇబ్బందేం లేదండీ. పాపం! చలిలో రాత్రల్లా ఆవిడ మాత్రం ఎలా పడుకుంటారు?" అంది యువతి.

అలా అంటూనే గది తలుపు వేసేసింది.

ఆవిడ తలుపు వేస్తున్నప్పుడు ఆవిడ వెనకే నిలుచుని ముసలాయన వైపు చూస్తున్న నాకు తీక్షణంగా మింగేసేటట్లు చూస్తున్న అతని కళ్ళు

కనిపించాయి.

గుండె దడదడ లాడింది.

• • • •

ఆ చూపులు మళ్ళా ఈ రోజు గుర్తు రాగానే గుండె దడదడ లాడుతూంది!

ఎన్నాళ్ళో గడిచి పోయాయి! ఆ రోజు ఆ భార్యా భర్తలు గదిలో విశ్రాంతిగా నిద్ర పోయాను.

పొద్దున్నే లేచేసరికి ఆ ముసలాయన లేడు.

ఆ భార్యా భర్త ఇద్దరూ కలిసి నన్ను బస్టాండుకి దిగబెట్టారు.

ఆ ఇంటర్వ్యూలో నేను సెలెక్టవ లేదు.

ఇన్నాళ్ళకి...మళ్ళీ ఆ చూపులు... గొంగళిపురుగు లాంటి ఆ స్పర్శ... గుర్తొస్తున్నాయి.

వయసు పైబడి, నలుగురి మధ్య ఉంటూనే ఏదేదో చెయ్యడానికి ప్రయత్నించా డతను.

వయస్సులో ఉండి, అర్ధరాత్రి, నిర్జన ప్రదేశంలో నిస్సహాయంగా ఉన్న నన్ను వదిలేస్తాడా ఇతను?

పాదం వెనక చప్పుడైంది! అతను వస్తున్నాడు.

నేను గుండె బిగబట్టుకుని చూస్తున్నాను.

దగ్గర కొచ్చి మళ్ళా సూట్ కేసులు రెండూ చేతిలోకి తీసుకొన్నాడు.

దగ్గర కొచ్చినప్పుడు మళ్ళా సారా వాసన గుప్పు మంది.

సూట్ కేసులు రెండూ తల మీద పెట్టుకుని అటు మళ్ళా నడవడం మొదలెట్టాడు.

దోచుకోబోయే నా శీలాన్ని— పోబోయే నా ప్రాణాన్ని తలుచుకుని నా అడుగులు భారంగా పడు తున్నాయి.

నేను అమ్మ చేతిని గట్టిగా పట్టుకున్నాను పసిపాపల్లే.

రేపటికి ఉద్యోగంలో మొదటి రోజు పూర్త వ్వాలి...

కాని జీవితమే పూర్తవబోతూంది చిత్రంగా...

రైల్వే పట్టాల పక్కన తుప్పలు దట్టంగా మొలిచి ఉన్నాయి.

ఒక్కో తుప్ప— ఒక్కో తుప్ప దాటుతున్నప్పుడల్లా నా కాలు మీద ఒక్కో పాము పాకినట్లు అనిపిస్తూంది.

అతని అడుగులు లయబద్ధంగా పడుతున్నాయి.

టార్చిలైటు వెలుగులో కదులుతున్న ఎర్రటి ఆ కాళ్ళు చూస్తుంటే...

ఇరవై ఏళ్ళ నిండని రవి కళ్ళలో కాంక్ష...

ఏభై ఏళ్ళ నిండిన ముసలాయన చూపుల్లో కసి...

ఒకదానివెనకొకటి తరుముకొస్తున్న భ్రాంతి!

నేచురల్ డిజైర్ నేచురల్ డిజైర్!


ఈ నేచురల్ డిజైర్ కి ఆధారం ఒక ఆడదాని శరీరం కాక ఆ శరీరంలోని హృదయం అయితే ఎంత బాగుండును!

ఎంతమంది విషయంలో అలా అవుతుంది!

అయిదు నిమిషాలు. పది నిమిషాలు. పదిహేను నిమిషాలు.

తుప్పలన్నీ దాటిపోయాయి.

మళ్ళీ పొలా లొచ్చేశాయి. దూరంగా చిన్న




చిన్న గుడిసెల్లాంటివికూడా కనపడుతున్నాయి.

ఆ గుడిసెల్లో బుడ్డి దీపాలు మినుకు మినుకు మంటున్నాయి.

తల వెనక్కైనా తిప్పి చూడకుండా అతను అదే వేగంతో నడుస్తున్నాడు.

దాటిపోయామా? నిజంగా దాటిపోయామా?

ఆ తుప్పల్నీ, మడుగునీ, నిర్జనంగా ఉన్న ఆ పొలాల్నీ అన్నిటినీ దాటిపోయామా?

నా మనస్సు ఇంకా నమ్మడం లేదు.

స్టేషన్లో లైట్లు దగ్గరగా కనపడుతున్నాయి.

రైల్వే షెడ్ కూడా దీపం వెలుగులో స్పష్టంగా కనపడుతూంది.

మగాడు. ఉత్త మగాడు. అనుకున్నాను అరగంట క్రితం.

మనిషి. నువ్వు సంపూర్ణమైన మానవత్వమున్న మనిషివి అనుకుంటున్నాను ఇప్పుడు.

రైలు పట్టాల మధ్యనించి దూరంగా ఏదో సెర్చిలైటు లాంటిది మా వైపు రావటం కనిపించింది.

అది క్రమ క్రమంగా దగ్గరవుతూంది.

కాస్సేపటికి ఆ వెలుగుతో పాటు మాటలుకూడా కలగా పులగంగా వినపడసాగాయి.

ఆ లైటు దగ్గర కొస్తున్న కొద్దీ ఆ వెలుగులో నలుగురైదుగురి ఆకారాలు స్పష్టంగా కనపడసాగాయి.

వాళ్ళు నలుగురూ మా దగ్గరికి వచ్చారు.

ఆ నలుగుర్లో డోర్నకల్ స్టేషన్లో ట్రైన్లోంచి గెంతేసిన కుర్రాళ్ళిద్దరూ కూడా ఉన్నారు!

నేను ఆశ్చర్యంగా చూశాను.

"అమ్మయ్య వచ్చేశారా? ఏమయ్యారో నని హడలి పోతున్నాం" ఆ ఇద్దరి కుర్రాళ్ళలో రవిలా ఉన్న కుర్రా డన్నాడు!

"హడలి పోవడమేమిటి? అయినా ఈ పెద్ద లైటు పట్టుకుని ఎక్కడికిలా బయలుదేరారు?" ఆశ్చర్యంగా అడిగాను.

"ఎక్కడి కేమిటండీ? మా గురించే" అన్నాడా కుర్రాడు.

"మా గురించా?" మరింత ఆశ్చర్యంగా అడిగాను.

"అవునండీ ఈ ట్రెయిను డోర్నకల్లో ఆపడం మానేసి చాలా రోజులయింది లెండి. బహుశః ఇప్పుడుకూడా ఆపుతున్నారనుకుని మీరు ఎక్కి ఉంటారు. కాని మీకు తెలియందన్న విషయం మా కిద్దరికీ తెలియదు కదండి. అంతకు ముందే మీ అమ్మగారి నడిగితే డోర్నకల్లో దిగుతా మని చెప్పారు. ఒక్కోసారి ట్రెయిన్లో రైల్వే వాళ్ళు ఎవరైనా డోర్నకల్లో దిగవలసిన వాళ్ళుంటే డోర్నకల్లో ట్రెయిన్ని కొన్ని సెకండ్లు ఆపినట్లే ఆపి తీసుకుపోతారు. మీరు బహుశః ఆ బాపతే నేమో అనుకున్నాం. మగాళ్ళయితే ఆ టైములో గుబుక్కున దూకేస్తారు. ఆడాళ్ళయితే కష్టమవుతుంది. అందుకే మిమ్మల్ని అడిగాను. 'దిగడంలో సాయం చెయమంటారా' అని. ఎందుకంటే ఒక్కోసారి ప్లాట్ ఫారం దాటి పోయాకకూడా ఆపుతుంటా రండి. మీరేమో సాయం అక్కర్లేదనేశారు. బహుశః మీకు ఇష్టమున్న ఉందేమో. మా గురించి కాస్సేపు ఆపుతా రేమోనని మేం ముందు గెంతేసి చూస్తుంటే ట్రెయిను ఆగకుండానే వెళ్ళిపోయింది. అప్పుడు తెలిసింది మీరు పొరపాటు పడ్డారని! ఇద్దరం గాభరా పడ్డాం. మరో అయిదు నిమిషాలకి తెలిసింది ఇక్కడికి మూడు మైళ్ళ దూరంలో ఎవరో చెయిన్ లాగి బండి ఆపేశారని. బహుశః మీరే ఆపేశారేమో అందరుడి అక్కడ దిగిపోతారేమో అని భయ పడ్డాం. మీ దగ్గర బహుశః టార్చిలైటుకూడా ఉండదేమో. దిగిన చోటే ఉండిపోతారేమో అని భయపడే సెర్చిలైటు సంపాదించి బయలుదేరేసరికి ఈ టైమయింది" ఊపిరి తీసుకోవడానికి అన్నట్లు ఆగాడతను.

నా కళ్ళలో గిర్రున తిరిగే నీటిని ఆపుకుందుకు వ్యర్థ ప్రయత్నం చేశాను.

అరగంట కిందటే వీళ్ళని విపరీతంగా అసహ్యించుకున్నాను.

"అయ్యయ్యో! ఎంత శ్రమ పడ్డారు నాయనా. ట్రెయిను ఆ స్టేషన్‌లో ఆగదని ముందే చెపితే ఇన్ని తిప్పలుండక పోను కదా" అంది అమ్మ ఆప్యాయంగా వాళ్ళ వైపు చూస్తూ.

"మీకు తెలుసనుకున్నామండీ. లేకపోతే స్టేషన్ రాక ముందే చెయిన్ లాగి ఆపేద్దుం" అన్నా డా కుర్రాడు.

థాంక్స్ లాటి చిన్న మాట వాడదాని కెందుకో మనసొప్పలేదు.

అరగంట క్రితం ప్రయాణంలో అమ్మ తప్ప ఎవరూ లేని ఒంటరిని! ఇప్పుడు నాచుట్టూ నలుగురు నాకు అండగా.

అందరం కలిసి నడుస్తున్నాం.

"కంగ్రాచ్యులేషన్సండీ. మీరు వారపత్రికలో వ్రాసిన వ్యాసం బ్రహ్మాండంగా ఉంది" అన్నాడు రవిలా ఉన్న కుర్రాడు

అప్పటికి పూర్తిగా మనలోకంలో కొచ్చాను.

వారం రోజుల కిందటే ఆ పత్రికలో పడిన వ్యాసం గుర్తొచ్చింది దానితో పాటు నా ఫోటో కూడా వేశారు.

"థాంక్స్. ఒక వ్యాసాన్నే అంత శ్రద్ధగా చదివారంటే. చదువులో మీకు ఆసక్తి ఉందనే అనుకోవాలి" అన్నాను ఆ కుర్రాళ్ళ వైపు మెచ్చికోలుగా చూస్తూ.

"తమాషా ఏమిటో తెలుసాండీ. నిన్ననే ఆ వ్యాసం చదివి దాని గురించి ఇద్దరం వాదించుకున్నాం. మీ పాయింట్లని సమర్థిస్తూ నేనూ, వ్యతిరేకిస్తూ ఇతనూ. ఇవాళ మీరు ట్రెయిన్లో కనపడ్డారు. ఇద్దరం చాలాసేపు తర్జన భర్జన పడ్డాం మీతో మాట్లాడదామా, వద్దా అని! ఒకవేళ ఆ ఫోటో లోని ఆవిడ మీరో, కాదోనని అనుమానం కూడా వచ్చింది."

ట్రెయిన్లో ఆ కుర్రాడు మాటిమాటికీ నా వైపు చూడ్డం ... వాళ్ళిద్దరూ నన్ను చూసి ఏదేదో మాట్లాడుకోడం గుర్తొచ్చింది!

"ఈ కాస్సేపటి పరిచయంలోనే అంత సాహసం చెయ్యకూడ దనుకోండి ... అయినా మిమ్మల్ని 'అక్కయ్యగారూ' అని పిలవచ్చా" అన్నాడు రవిలా ఉన్న కుర్రవాడు.

"సంవత్సరం పాటు ఇలా దగ్గరగా మసలుతుంటే నేచురల్ డిజైర్స్ కలగడం సహజం కదండీ" అన్న రవి గొంతు చెవిలో ఖంగుమంది!


తేడా ఎందులో ఉంది? పుట్టుకలోనా ... పెంపకంలోనా ... పరిసరాల్లోనా?

యువకులందరూ రవిలేనా? ముసలాళ్ళందరూ ఇప్పటికీ పేరు తెలియని ఆ ముసలాయన లాంటి వారేనా?

ఆలోచిస్తున్నాను.

"ఏమిటంత దీర్ఘంగా ఆలోచిస్తున్నారు? ఈ సినిమా థైలాసు తీస్తూనా?" అన్నా డా కుర్రాడు చిరునవ్వుతో.

"కాదు ... కాదు... మీ ఇష్టం వచ్చినట్లు పిల్చుకొనే హక్కు మీ కెప్పుడూ ఉంది" అన్నాను.




మరో అయిదు నిమిషాలు నడిచాం. వచ్చేశాం!

చీకట్లోంచి వెలుగులోకి ...

నిర్జనమైన పొలాల్లోంచి సందడిగా ఉన్న స్టేషన్ మధ్యలోకి.

కీచురాళ్ళ చప్పుళ్ళల్లోంచి మనుష్యుల అరుపుల మధ్యకి...

స్టేషన్ ప్లాట్‌ఫారమ్ మీద అడుగుపెట్టాం.

అంతవరకు టార్చిలైటు వెలుగులో అతని కాళ్ళనే చూశాను.

స్టేషను దీపాల వెలుగులో అతని మొహాన్ని పరిశీలనగా చూశాను.

నే ననుకొన్నట్లు ఎర్రగా చింతనిప్పుల్లా లేవా కళ్ళు!

మరి అప్పుడలా కనిపించాయేం? మనస్సు కలిగించిన భ్రమా?

"మరి మేం సెలవు తీసుకుంటా మండీ" అన్నారు కుర్రాళ్ళు.

"మంచిది, నాయనా... క్షేమంగా వెళ్ళండి" అంది అమ్మ మనఃస్ఫూర్తిగా.

"వెళ్ళొస్తామండీ, అక్కయ్యగారూ... చిన్న మాట ... మీకు అభ్యంతరం లేకపోతే మీ అడ్రస్ ఇస్తారా? మీరు భవిష్యత్తులో మంచి రచయిత్రి అవుతారేమో అనిపిస్తోంది ... మీతో కరస్పాండెన్స్ నడపాలనుందండి."

"ఓ తప్పకుండా!" బాగ్‌లోంచి కాగితం తీసి అడ్రస్ రాసి ఇచ్చాను.

వాళ్ళు సెలవు తీసుకుని వెళ్ళిపోయారు.

ప్లాట్‌ఫారమ్ మీద నేనూ, అమ్మా, అతనూ మిగిలాం.

అతను రెండు సూట్‌కేసులని, నేను బుట్టని ప్లాట్‌ఫారమ్ మీద పెట్టేసి భుజం మీది తుండుగుడ్డతో ముఖానికి పట్టిన చెమటని తుడుచుకొంటున్నాడు.

అతను నా పెట్టెలో ఉన్న డబ్బుల్ని ఆశించలేదు... ఒంటిమీదున్న నగల్ని ఆశించలేదు... నా మానాన్ని ఆశించలేదు... ప్రాణాన్ని ఆశించలేదు.

కాని అతని శ్రమకి తగిన ప్రతిఫలాన్ని ఆశించడం సహజం! అతి సహజం!

ఏమియ్యాలి అతనికి? ఎంతియ్యాలి?

అతని శ్రమకి విలువ కడితే అంత దూరం బరువు మోసినందుకు కనీసం పది రూపాయ లియ్యాలి!

కాని నేను విలువ కట్టవలసింది కేవలం అతని శ్రమకేనా?

అతను అతి సులువుగా పట్టుకుపో గల్గిన సూట్‌కేసులోని వస్తువుల ఖరీదు అయిదు వందలూ ...

అందులోని సర్టిఫికెట్ల ఖరీదు అయిదువేలు!

నా శీలం ఖరీదు!

ప్రాణం ఖరీదు?!

అమ్మ ఖరీదు! ?

దేనికని నేను ఖరీదు కట్టగలను?

"ఇక నేను వెళ్తానండీ" అన్నా డతను తలపాగా సర్దుకొంటూ.

అప్పుడు నా పర్సులో ఉన్నవి ఓ యాభై రూపాయల నోటూ, ఓ ఇరవై రూపాయల నోటూ.

అప్రయత్నంగానే యాభై నోటు తీశాను.

"తీసుకోవోయ్" అన్నాను నోటున్న చేతిని అతని వైపుకు చాస్తూ.

అతను చేతిలో ఉన్న నోటుని ... నా మొహాన్ని మార్చి మార్చి చూశాడు కాస్సేపు.

ఆ తర్వాత రెండు చేతులూ జోడించాడు.

"పైసలిచ్చి నా మనసు కష్టపెట్టకండి అమ్మగారూ! చీకట్లో ఒంటరిగా బయల్దేరారు ఆడ కూతుర్లిద్దరూ. సాయం చెయ్యడం నా డూటీ. నా డూటీ నేను చేశా ... దానికి డబ్బెందుకు?" అలా అంటూనే అతను పెద్ద పెద్ద అంగలు వేసుకొంటూ స్టేషన్ గేట్ వైపు నడిచాడు.

నిశ్చేష్టురాలినై నే నలాగే అతనివైపు చూస్తూ ఉండిపోయాను.

నా చేతిలో ఉన్న నోటు తేలికై ... అతి తేలికై ... దూది పింజెకంటే తేలికై ... రెపరెపలాడి ... నా చేతిలోంచి జారిపోయి గాలి కెగిరి అతను నడిచిన చోట పడింది.

నేను చూస్తుండగానే మిగతా మనుష్యుల్లో కలిసి పోయా డా మనిషి! (సమాప్తం)